# విశాల భారతి

తెలుగు దినపత్రిక

28-02-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 56


## మాజీ మావోయిస్టులకు సర్కార్ అభయం

- సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆరుగురు మాజీ మావోయిస్టుల సమావేశం
- హింస వీడి జనజీవన స్రవంతిలో కలిసిన నేతలకు సీఎం ప్రత్యేక అభినందనలు
- ప్రజాస్వామ్యం ద్వారానే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని సీఎం ఉద్ఘాటన
- మాజీలకు పూర్తి భద్రత, గౌరవప్రదమైన జీవనం కల్పిస్తామని ప్రభుత్వం హామీ
- పొరుగు రాష్ట్రాల తరహాలో మెరుగైన పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని మాజీల వినతి
- రెండేళ్లలో 591 మంది మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించిన డీజీపీ

03



## మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు విముక్తి
- ఆమ్ ఆద్మీ పార్టీ నేతలందరికీ ఊరటనిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు
- కోర్టు తీర్పు వెలువడగానే భావోద్వేగానికి లోనైన ముఖ్యమంత్రి
- అంతిమంగా ధర్మమే జయించిందని ప్రకటించిన కేజ్రీవాల్
- పార్టీని నాశనం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని ఆరోపణ
- తప్పుడు కేసులతో తన నిజాయితీని శంకించారని ఆవేదన



**విశాలభారతి, జాతీయం:**

దేశ రాజధాని రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ వ్యవహారంలో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పును వెలువరిస్తూ కేజ్రీవాల్‌కు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు తీసుకున్న నిర్ణయం ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

మిగతా 2లో..

# లిక్కర్ క్వీన్ TO క్లీన్ క్వీన్

## కడిగిన ముత్యంలా బయటకొచ్చా: కవిత



సుదీర్ఘ కాలం పాటు రాజకీయ, న్యాయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం విధానం కేసులో తనకు క్లీన్ చిట్ లభించడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసు నుంచి తాను కడిగిన ముత్యంలా బయటకు వచ్చానని ఆమె ధీమాగా ప్రకటించారు. న్యాయస్థానం వెలువరించిన తీర్పుతో తనపై జరిగిన ఆరోపణలన్నీ నిరాధారమని తేలిపోయాయని ఆమె పేర్కొన్నారు. ఇన్నాళ్లు తనపై మోపిన నిందలు, ఎదుర్కొన్న విమర్శలకు కాలమే సమాధానం చెప్పిందని ఆమె ఉద్వేగంగా వ్యాఖ్యానించారు. ఈ విజయం కేవలం తనది మాత్రమే కాదని, న్యాయం వైపు నిలబడిన ప్రతి ఒక్కరిదని ఆమె కొనియాడారు.



- రాజకీయ కుట్రల నుంచి విముక్తి లభించింది
- లిక్కర్ కేసులో ఎలాంటి అవకతవకలు లేవు
- న్యాయవ్యవస్థపై ఉన్న నమ్మకం నిజమైంది
- నన్ను వేధించిన వారు ఇప్పుడు ఏమంటారు?
- పోరాటంలో అండగా నిలిచిన వారికి ధన్యవాదాలు
- ఇదంతా దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను

02



02

## 'ముందుంది ముసళ్ల పండుగ'

- సాంకేతిక కారణాలతోనే మద్యం కేసు కొట్టివేత: ఎన్. రామచందర్ రావు
- తీర్పు వచ్చినంత మాత్రాన నిందితులు నిర్దోషులు కాలేరని స్పష్టీకరణ
- రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుపై సీబీఐ పైకోర్టుకు వెళ్లే అవకాశం
- తప్పు చేయకపోతే సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు ఎందుకు ధ్వంసం చేశారు?
- లిక్కర్ స్కామ్ ఆరోపణలు మొదట చేసింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు
- "ముందుంది ముసళ్ల పండుగ".. నిందితులకు బీజేపీ నేత హెచ్చరిక

## అఫ్గాన్‌పై పాక్ యుద్ధం



- కాబుల్ లక్ష్యంగా పాకిస్థాన్ వైమానిక దాడులు
- 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్' ప్రారంభించిన పాక్
- 55 మంది పాక్ సైనికులను హతమార్చామన్న అఫ్గాన్
- 150 మంది అఫ్గాన్ దళాలను మట్టుబెట్టామన్న పాకిస్థాన్
- రంగంలోకి అఫ్గాన్ ఆత్మాహుతి దళాలు
- సరిహద్దులో కూలిన పాక్ ఎఫ్-16 యుద్ధ విమానం

04

# అయ్యో యూరియా..!

- యూరియా కోసం రైతన్నల పడిగాపులు
- కొత్తగా తెచ్చిన యాప్ విధానంపై ఆగ్రహం
- స్మార్ట్ ఫోన్ లేక సగటు రైతు బేజారు
- బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న ఎరువుల నిల్వలు

03




## భవిష్యత్ భద్రతే లక్ష్యం

- 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా పక్కా రోడ్ మ్యాప్
- గత దశాబ్ద కాలంలో 'ఫ్రైజైల్ ఫైవ్' నుంచి గ్లోబల్ గ్రోత్ ఇంజిన్‌గా భారత్
- దిగుమతులపై ఆధారపడటం తగ్గించి ఎగుమతుల దిశగా అడుగులు
- కాంగ్రెస్ వైఫల్యాలపై ధ్వజమెత్తిన ప్రధాని, దేశ నిర్మాణంపై విమర్శలు
- ఏఐ విప్లవంలో కేవలం భాగస్వామి మాత్రమే కాదు.. సారథిగా భారత్
- స్వయంసమృద్ధి ద్వారానే యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని వెల్లడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భారతదేశం ప్రపంచ వేదికపై ఒక శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా దూసుకుపోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన 'న్యూస్18 రైజింగ్ భారత్ సమిట్ 2026'లో ఆయన పాల్గొని కీలక ప్రసంగం చేశారు.




## లిక్కర్ కేసు వల్ల ఓడిపోయాం

- ఢిల్లీ మద్యం కేసులో కవితకు ఊరటపై కేటీఆర్ హర్షం
- కక్షసాధింపు రాజకీయాలకు చెక్ పడిందన్న మాజీ మంత్రి
- సుదీర్ఘ నిరీక్షణ తర్వాత న్యాయస్థానంలో దక్కిన క్లీన్ చిట్
- కుటుంబ సభ్యుల్లోనూ, పార్టీ శ్రేణుల్లోనూ మిన్నంటిన ఉత్సాహం
- రాజకీయ కుట్రలను తిప్పికొడతామంటూ కేటీఆర్ ధీమా

02




# కాంగ్రెస్ ఇంకా నేర్చుకోలేదా?

## చెరువులు, నాలాల పరిరక్షణపై ప్రభుత్వ దృఢ సంకల్పం

- క్షేత్రస్థాయిలో అమలు తీరుతో పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత
- ముందస్తు నోటీసులు, కసరత్తు లేకుండానే జెసిబిల మోత
- ఖమ్మం భూదాన్ భూముల వ్యవహారంలో రాజకీయ రచ్చ
- మూసీ ప్రక్షాళనపై సోషల్ మీడియాలో భారీ ప్రచారం
- ప్రజలతో కమ్యూనికేషన్ గ్యాప్‌తో దెబ్బతింటున్న ప్రతిష్ట

03



# లిక్కర్ కేసు వల్ల ఓడిపోయాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాజకీయాల్లో ఆరోపణలు రావడం సహజం కానీ, వాటిని ఎదుర్కొని నిజాయితీని నిరూపించుకోవడం ఒక సవాల్‌తో కూడుకున్న ప్రక్రియ. గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు న్యాయస్థానంలో ఊరట లభించడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామంపై ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. న్యాయం గెలిచిందని, నిప్పులాంటి నిజం నిలబడిందని ఆయన చేసిన ట్వీట్లు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సుదీర్ఘ కాలం పాటు సాగిన ఈ విచారణ ప్రక్రియలో కవిత అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని, కానీ చివరకు న్యాయమే జయిస్తుందన్న తమ నమ్మకం నిజమైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కేసులో కవితకు క్లీన్ చిట్ లభించడం కేవలం ఒక వ్యక్తికి దక్కిన విజయం కాదని, ఇది అబద్ధపు ప్రచారాలపై సాధించిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయంగా తమను దెబ్బతీయాలని చూసిన శక్తులకు ఈ తీర్పు ఒక చెంపపెట్టు అని ఆయన వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పుతో తమ కుటుంబంపై ఉన్న ఒత్తిడి తొలగిపోయిందని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. కేంద్ర సంస్థల దర్యాప్తు పేరుతో విపక్ష నేతలను ఇబ్బంది పెట్టడం పరిపాటిగా మారిందని కేటీఆర్ విమర్శించారు. కవితను ఈ కేసులో ఇరికించడం వెనుక రాజకీయ కుట్ర ఉందని తాము మొదటి నుంచి చెబుతున్నామని, నేడు న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో తమ




వాదన బలపడిందని ఆయన గుర్తు చేశారు. విచారణ సంస్థల ద్వారా భయభ్రాంతులకు గురిచేయాలని చూసిన వారికి న్యాయస్థానమే సరైన సమాధానం చెప్పిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ విజయం తమ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, నిజాయితీకి మరణం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

ఢిల్లీ మద్యం కేసు విచారణ సమయంలో కవితపై రకరకాల కథనాలు వచ్చాయని, ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేసేలా కొన్ని శక్తులు ప్రయత్నించాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపినప్పటికీ, ధైర్యాన్ని కోల్పోకుండా కవిత పోరాటం చేశారని ఆయన కొనియాడారు. ఒక మహిళా నేతగా ఆమె చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని, చివరకు ఆమె నిర్దోషిగా బయటపడటం తమందరికీ గర్వకారణమని ఆయన వివరించారు. ఈ కష్టకాలంలో తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, న్యాయస్థానాల తీర్పులే వారికి అసలైన సమాధానాలని కేటీఆర్ అన్నారు. గతంలో కూడా అనేక ఆరోపణలు తమపై వచ్చాయని, కానీ వాటన్నింటినీ తాము సమర్థవంతంగా ఎదుర్కొన్నామని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులు, న్యాయంపై తమకున్న నమ్మకమే తమను ఇక్కడి వరకు నడిపించాయని ఆయన పేర్కొన్నారు. ఇకనైనా కక్షసాధింపు రాజకీయాలను వీడి, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ప్రత్యర్థులకు ఆయన హితవు పలికారు.

కవితకు ఊరట లభించిన వార్త తెలియగానే తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. ప్రధాన కూడళ్లలో పాలాభిషేకాలు చేస్తూ, స్వీట్లు పంచుతూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ స్పందనను చూసి కేటీఆర్ మురిసిపోయారు. కార్యకర్తల ప్రేమే తమ బలమని, ప్రజల పక్షాన నిలబడి పోరాడే శక్తిని ఇస్తుందని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో మరింత బలంగా దూసుకుపోతామని, రాజకీయ కుట్రలను ప్రజల సహాయంతోనే తిప్పికొడతామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

న్యాయ వ్యవస్థపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ధర్మం ఎప్పుడూ ఓడిపోదని కేటీఆర్ పునరుద్ఘాటించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ అవి వ్యక్తిగత దూషణలకు, కుటుంబ సభ్యులను ఇరికించే స్థాయికి చేరడం దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కేసు ద్వారా తాము నేర్చుకున్న పాఠం ఏమిటంటే, నిలకడగా నిజం వైపు ఉంటే విజయం వరిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. విచారణ ఎదుర్కొన్న ప్రతి రోజూ కవిత ధైర్యంగా ఉన్నారని, ఆమె నిర్దోషిత్వంపై తమకు ఎప్పుడూ అనుమానం లేదని ఆయన చెప్పారు.

కేంద్ర దర్యాప్తు సంస్థల తీరుపై కూడా కేటీఆర్ పరోక్షంగా సెటైర్లు వేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సంస్థలను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని ఆయన హెచ్చరించారు. కవిత కేసులో వెలువడిన ఫలితం ఇలాంటి ధోరణులకు ముగింపు పలకాలని ఆయన కోరారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కానీ అది పారదర్శకంగా ఉండాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నేడు వచ్చిన ఈ క్లీన్ చిట్ రాజకీయ వర్గాల్లో పెను సంచలనమే సృష్టించిందని, ఇది నైతిక విజయం అని ఆయన అభివర్ణించారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ఆడబిడ్డ ఎప్పుడూ తలవంచదని, పోరాట పటిమ కవిత రక్తంలోనే ఉందని కేటీఆర్ అన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎన్ని కుట్రలు పన్నినా కవిత అజేయంగా నిలిచారని ఆయన ప్రశంసించారు. సోదరిగా ఆమె పడుతున్న కష్టాన్ని చూసి బాధపడ్డానని, కానీ నేడు ఆమె గెలుపు చూసి ఒక సోదరుడిగా ఎంతో గర్విస్తున్నానని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ విజయం పార్టీకి మాత్రమే కాకుండా, కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక ఆశాకిరణంలా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## తప్పుల తడకగా విద్య కమీషన్ రిపోర్ట్

- ప్రోగ్రెస్సివ్ రికగనిస్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్
- ఖమ్మం జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు



**ఖమ్మం, విశాలభారతి:** విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వంకు అందించిన ఎడ్యుకేషన్ పాలసీ పర్ తెలంగాణ 2026 సుదీర్ఘ రిపోర్టులో ఉపాధ్యాయులకు వేతనాలు మార్కెట్ ప్రమాణాలతో పోలిస్తే ఎక్కువగా ఉన్నాయి అనే వ్యాఖ్యానం పూర్తిగా అనుచితమైనది మరియు వాస్తవాలకు విరుద్ధమైనదని పిఆర్టియు టీ ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు కట్టా శేఖర్రావు , ఆర్ రంగారావు లు ఖండించడం జరిగింది . ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే వ్యక్తులు . భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత వారి భుజాలపై ఉంటుంది . అలాంటి మహత్తర సేవ చేస్తున్న ఉపాధ్యాయుల జీతాలను ఎక్కువ గా పేర్కొనడం వారి కృషిని తక్కువ చేసి చూపించే ప్రయత్నమే అవుతుంది . జీతాలు అనేవి సాధారణంగా ధరల పెరుగుదల (ద్రవ్యోల్బణం )కు అనుగుణంగా సవరించబడతాయి . నిత్యావసర వస్తువుల ధరలు , ఇంధన వ్యయం , గృహ వసతి ఖర్చులు వంటి అంశాలు పెరుగుతున్నప్పుడు ఉద్యోగుల జీవన వ్యయం కూడా పెరుగుతుంది . అందువల్ల జీతాల్లో సవరణలు చేయడం సహజమైన పరిపాలనా ఒక ప్రక్రియ . ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయుల జీతాలను అత్యధికం గా పేర్కొంటూ రిపోర్ట్ లో పెట్టడం సముచితం కాదు . ఇది వారి వాస్తవ పరిస్థితులను , బాధ్యతలను , అర్హతలను పరిగణనలోకి తీసుకోని వ్యాఖ్యగా భావించవచ్చు . వారు మార్కెట్ ప్రమాణాలను అని భావించిన పాఠశాలలు చెల్లించాల్సిన భత్యాలు తక్కువ చెల్లిస్తూ చేస్తున్న అన్యాయం గురించి మాట్లాడితే బాగుండేది . ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పేవారే కాదు . భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను నిర్వహిస్తున్నారు . నాణ్యమైన విద్య ఇవ్వాలంటే ముందుగా ఉపాధ్యాయ వృత్తిని ఆకర్షణీయంగా , గౌరవప్రదంగా మార్చాలి . సరైన వేతనం ఇవ్వడం అనేది ఖర్చు కాదు అది దేశ భవిష్యత్తులో పెట్టుబడి . సరైన మరియు గౌరవప్రదమైన జీతభత్యాలు ఉన్నప్పుడే నిష్ణాతులు , ప్రతిభావంతులు , తెలివైన యువత ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది . వృత్తి స్థిరత్వం , ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం , ఈ మూడు అంశాలు కలిసే ఒక మంచి ఉపాధ్యాయ వ్యవస్థ ఏర్పడుతుంది . తక్కువ వేతనం , అధిక బాధ్యతలు ఉన్న వృత్తిని ప్రతిభావంతులు ఎంచుకోవడానికి ఆసక్తి చూపరు . ఫలితంగా విద్యా రంగంలో నాణ్యత తగ్గే ప్రమాదం ఉంటుంది . ఉపాధ్యాయులకు పదోన్నతులు సీనియారిటీ ద్వారా కాకుండా పారామీటర్ల ద్వారా అనడం అర్థరహితం ..... అవగాహన రాహిత్యం .... మరియు సర్వీస్ రూల్స్ కు పూర్తి గా వ్యతిరేకం . దాదాపు నియామకం అయిన కేడర్ లోనో లేక దాదాపు రెండు దశాబ్దాలు ( సుమారు 20 సంరాలకు కూడా రాని పదోన్నతి ) సర్వీస్ చేస్తే కానీ పదోన్నతి రాని ఉపాధ్యాయులకు పదోన్నతి సీనియారిటీ కాకుండా పారామీటర్ ల ఆధారంగా పదోన్నతి అనేదానిని పిఆర్టియు టీ ఎస్ సంఘం వ్యతిరేకిస్తుంది . ఎహెఎం పోస్టులకు 50% నియామకం ద్వార నీయమించడాన్ని కూడా వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు . అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు ఒక పాఠశాలను సమర్థవంతంగా నడపగలరు అందుకే ప్రస్తుతం ఉన్న సర్వీస్ రూల్స్ ప్రకారం ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేవలం పదోన్నతి ద్వారా మాత్రమే భర్తీ చేస్తున్నారు.

# 'ముందుంది ముసళ్ల పండుగ'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తుతం దేశవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసును కోర్టు కొట్టివేయడంపై తెలంగాణ బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహా ఇతర నిందితులకు ఇది కేవలం తాత్కాలిక ఊరట మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కోర్టు తీర్పు వెలువడినంత మాత్రాన వారు చేసిన తప్పులు మాసిపోవని, ఈ తీర్పు కేవలం కొన్ని సాంకేతిక కారణాల ప్రాతిపదికన మాత్రమే వచ్చిందని ఆయన విశ్లేషించారు. న్యాయప్రక్రియలో ప్రాథమిక స్థాయి కోర్టులు ఇచ్చే తీర్పులు అంతిమమైనవి కావని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఈ కేసును కోర్టు డిశ్చార్జ్ చేసినంత మాత్రాన నిందితులు తాము నిర్దోషులమని భావించడం వారి అమాయకత్వమే అవుతుందని ఆయన విమర్శించారు. దర్యాప్తు సంస్థలు సేకరించిన సాక్ష్యాధారాలు, నిందితుల ప్రమేయంపై ఉన్న ఆరోపణలు ఇంకా సజీవంగానే ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును నిశితంగా పరిశీలిస్తే, అందులో ఎక్కడా నిందితులు ఎటువంటి తప్పు చేయలేదని కోర్టు పేర్కొనలేదని, కేవలం దర్యాప్తు ప్రక్రియలోని కొన్ని లోపాలను మాత్రమే ఎత్తిచూపిందని ఆయన వివరించారు.

ఈ కేసులో తదుపరి కార్యాచరణపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఇప్పటికే కసరత్తు చేస్తోందని రామచందర్ రావు వెల్లడించారు. ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ త్వరలోనే పైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. సాధారణంగా ఇటువంటి కీలకమైన కేసుల్లో దర్యాప్తు సంస్థలు తమ వద్ద ఉన్న ఆధారాలను మరింత పకడ్బందీగా ఉన్నత న్యాయస్థానాల ముందు ఉంచుతాయని, అక్కడ తీర్పు తలకిందులయ్యే అవకాశం పుష్కలంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం ఇప్పుడే ముగిసిపోలేదని, ఇది కేవలం ఒక మలుపు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు.



కల్వకుంట్ల కవితపై రామచందర్ రావు నేరుగా విమర్శలు గుప్పించారు. ఢిల్లీ మద్యం పాలసీలో ఆమె పాత్ర లేనప్పుడు, ఎటువంటి అక్రమాలకు పాల్పడనప్పుడు దర్యాప్తు సమయంలో సెల్‌ఫోన్లను, సిమ్ కార్డులను ఎందుకు ధ్వంసం చేయాల్సి వచ్చిందని ఆయన నిలదీశారు. ఏదైనా ఒక వ్యక్తి తప్పు చేయనప్పుడు ఆధారాలను దాచాల్సిన అవసరం ఉండదని, కానీ ఈ కేసులో నిందితులు వ్యవహరించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. ఫోన్లను తగలబెట్టడం లేదా మార్చడం వెనుక ఉన్న అసలు రహస్యాన్ని దర్యాప్తు సంస్థలు ఎప్పటికైనా బయటకు తీస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంపై కూడా రామచందర్ రావు తనదైన శైలిలో ప్రశ్నలు సంధించారు. అసలు ఢిల్లీలో అమలులో ఉన్న పాత మద్యం విధానాన్ని మార్చాల్సిన అవసరం ఆప్ ప్రభుత్వానికి ఎందుకు వచ్చిందో కేజ్రీవాల్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త పాలసీ ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేలా నిబంధనలను రూపొందించడం వెనుక పెద్ద ఎత్తున క్విడ్ ప్రో కో జరిగిందని ఆయన ఆరోపించారు. కేవలం ఆర్థిక లాభాల కోసమే మద్యం వ్యాపారులకు అనుకూలంగా విధానాలను మార్చారని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఆయన వివరించారు.

ఈ కేసు విచారణకు, భారతీయ జనతా పార్టీకి ఎటువంటి సంబంధం లేదని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో అవకతవకలు జరిగాయని మొట్టమొదట ఆరోపణలు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తు చేశారు. 2022లోనే కాంగ్రెస్ నేతలు ఈ కుంభకోణంపై ఫిర్యాదులు చేశారని, ఆ తర్వాతే సీబీఐ, ఈడీ వంటి సంస్థలు రంగంలోకి దిగాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ దర్యాప్తు సంస్థలను వాడుకుంటోందన్న ఆరోపణలు అవాస్తవమని, నిందితులు తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి విమర్శలు చేస్తున్నారని ఆయన కొట్టిపారేశారు. కోర్టులో దర్యాప్తు సంస్థలు ఎదుర్కొన్న ఇబ్బందులను కూడా ఆయన విశ్లేషించారు. దర్యాప్తు అధికారులు కోరిన కీలక పత్రాలను నిందితులు సమర్పించలేదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుబాటులో లేకపోవడం వల్ల లేదా నిందితులు సహకరించకపోవడం వల్ల సీబీఐ కోర్టు అడిగిన కొన్ని పత్రాలను సకాలంలో అందజేయలేకపోయి ఉండవచ్చని పేర్కొన్నారు. దీనినే సాంకేతిక లోపంగా పరిగణించి కోర్టు కేసును కొట్టివేసి ఉండవచ్చు తప్ప, నిందితుల ప్రమేయం లేదని కాదని ఆయన వివరించారు. చట్టంలోని సందులను వాడుకుని తప్పించుకోవాలని చూడటం సాధ్యం కాదని హెచ్చరించారు. లిక్కర్ స్కామ్ కేసు దర్యాప్తులో 2024 నుంచి ఈడీ, సీబీఐలు వేగవంతంగా వ్యవహరించాయని, అప్పటి నుంచి సేకరించిన ఆధారాలు చాలా బలంగా ఉన్నాయని రామచందర్ రావు తెలిపారు. పక్కా సాక్ష్యాధారాలు లేకుండా దర్యాప్తు సంస్థలు అరెస్టులు చేయవని, చార్జ్ షీట్లలో పేర్కొన్న అంశాలు నిజమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడు వచ్చిన తీర్పుతో విపక్షాలు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమని, వారు కేవలం రాజకీయంగా మైలేజీ పొందడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు ప్రజలకు తెలుసని, త్వరలోనే అసలు నిజాలు నిరూపితమవుతాయని ఆయన చెప్పారు. ప్రస్తుత తీర్పుతో నిందితులు చంకలు గుద్దుకోవాల్సిన అవసరం లేదని రామచందర్ రావు హెచ్చరించారు. "ముందుంది ముసళ్ల పండుగ" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసు కొట్టివేసినంత మాత్రాన అది శాశ్వతం కాదని, దర్యాప్తు సంస్థలు మరిన్ని పక్కా ఆధారాలతో పైకోర్టుకు వెళ్లినప్పుడు నిందితులకు కష్టాలు తప్పవని పేర్కొన్నారు.

# 'లిక్కర్ క్వీన్ TO క్లీన్ క్వీన్'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

లిక్కర్ స్కామ్ అనేది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సృష్టించబడిన ఒక కట్టుకథ అని కవిత మండిపడ్డారు. ఇందులో ఎలాంటి ఆర్థిక అవకతవకలు జరగలేదని మొదటి నుంచి తాను చెబుతున్న మాటనే నేడు కోర్టు ధ్రువీకరించిందని ఆమె గుర్తు చేశారు. కేంద్రంలోని అధికార పక్షం రాజకీయ కక్షతోనే తనను ఈ కేసులోకి లాగిందని, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించిందని ఆమె విమర్శించారు. ఒక పద్ధతి ప్రకారం తనపై దుష్ప్రచారం చేశారని, అయితే వాస్తవాలు ఎప్పుడూ దాగవని ఈ తీర్పు నిరూపించిందని ఆమె స్పష్టం చేశారు. రాజకీయ కుట్రలు ఎన్ని చేసినా అంతిమంగా ధర్మమే గెలుస్తుందని ఆమె ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలోని న్యాయ వ్యవస్థపై తనకు ఉన్న అచంచలమైన నమ్మకం నేడు నిజమైందని కవిత సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ చట్టంపై గౌరవంతో తాను విచారణకు సహకరించానని ఆమె వివరించారు. న్యాయ దేవత కళ్లు కప్పి అబద్ధాలతో ఎక్కువ కాలం నెట్టుకురాలేరని ఈ తీర్పు ద్వారా స్పష్టమైందని ఆమె అభిప్రాయపడ్డారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను అణచివేయాలని చూసే వారికి ఇదొక గుణపాఠమని ఆమె హెచ్చరించారు. వ్యవస్థల పట్ల తనకు ఉన్న గౌరవం మరింత పెరిగిందని, నిజాన్ని నిర్భయంగా చాటిచెప్పిన న్యాయస్థానానికి ఆమె శిరస్సు వంచి నమస్కరించారు.

లిక్కర్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలను ప్రజలెవరూ నమ్మలేదని కవిత ధీమా వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన ఈ సంక్షోభ సమయంలో తెలంగాణ ప్రజలు, పార్టీ శ్రేణులు తనకు కొండంత అండగా నిలిచారని ఆమె గుర్తు చేసుకున్నారు. తన నిజాయితీని నమ్మి తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో తోడుగా ఉన్న కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తల ప్రేమాభిమానాలే తనను ఈ పోరాటంలో ముందుకు నడిపించాయని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజాక్షేత్రంలో తన పట్ల ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు మరింత బలపరిచిందని ఆమె పేర్కొన్నారు.

ఈ కేసును అడ్డం పెట్టుకుని కొందరు తనను మానసికంగా ఎంతో హింసించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థల పేరుతో వేధింపులకు




గురిచేయడమే కాకుండా, సామాజిక మాధ్యమాల్లో తనపై రకరకాలుగా అసత్య ప్రచారాలు చేశారని ఆమె మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం ఒక మహిళపై ఇష్టానుసారంగా మాట్లాడటం ఏ రకమైన సంస్కృతి అని ఆమె ప్రశ్నించారు. అప్పట్లో తనను విమర్శించిన వారు, నిందలు వేసిన వారు ఇప్పుడు ఏ సమాధానం చెబుతారని ఆమె నిలదీశారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు ప్రయత్నించిన వారికి ఈ రోజు ఎదురుదెబ్బ తగిలిందని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. లిక్కర్ కేసు నుంచి తనకు విముక్తి లభించడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. సత్యం వైపు నిలబడిన వారికి దైవబలం ఎప్పుడూ ఉంటుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఇన్ని రోజుల నిరీక్షణకు, పడ్డ కష్టానికి ఫలితం దక్కిందని ఆమె సంతోషపడ్డారు. చీకటి రోజులు గడిచిపోయాయని, ఇకపై పూర్తిస్థాయిలో ప్రజా సేవలో నిమగ్నమవుతానని ఆమె ప్రకటించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల కోసం చేసే పోరాటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ విజయం తనలో కొత్త ఉత్సాహాన్ని, మరింత బాధ్యతను నింపిందని ఆమె వివరించారు.

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే దర్యాప్తు సంస్థలు తనపై తప్పుడు కేసులు నమోదు చేశాయని కవిత ఆరోపించారు. ఎటువంటి సాక్ష్యాధారాలు లేకపోయినా కేవలం రాజకీయ అవసరాల కోసం తనను ఇబ్బంది పెట్టారని ఆమె విమర్శించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఆమె అభివర్ణించారు. ఎన్ని కుట్రలు పన్నినా నిజాయితీని ఎవరూ దాచలేరని ఈ పరిణామం రుజువు చేసిందని ఆమె అన్నారు. ఇప్పటికైనా రాజకీయ ప్రత్యర్థులు తప్పుడు ఆరోపణలు మానుకుని నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని ఆమె హితవు పలికారు.

గత కొన్నాళ్లుగా సాగిన ఈ న్యాయపోరాటంలో తాను ఎన్నడూ ధైర్యం కోల్పోలేదని కవిత చెప్పారు. తన తండ్రి కేసీఆర్ నుంచి నేర్చుకున్న పోరాట పటిమతోనే అన్ని ఒత్తిళ్లను తట్టుకుని నిలబడ్డానని ఆమె తెలిపారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తాను ఎదుర్కొన్న ఎన్నో సవాళ్లు తనను రాటుదేల్చాయని, ఈ మద్యం కేసు కూడా తనను మరింత దృఢంగా మార్చిందని ఆమె పేర్కొన్నారు. తనపై వచ్చిన మచ్చను తుడిచేసుకుని మళ్లీ ప్రజల మధ్యకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె ప్రకటించారు. వాస్తవాలను గ్రహించిన ప్రజలు ఎప్పుడూ తన వైపే ఉంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

లిక్కర్ కేసు పేరుతో సాగిన డ్రామా ఇకనైనా ముగియాలని కవిత కోరారు. ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని వ్యవస్థలను ప్రభావితం చేయడం సరైన పద్ధతి కాదని ఆమె సూచించారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, కానీ కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం వాటిని కాలరాస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఈ కేసు ద్వారా తనకు కలిగిన నష్టం పూడ్చలేనిదైనా, న్యాయం గెలిచినందుకు తనకు ఎంతో సంతృప్తిగా ఉందని ఆమె వివరించారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే కానీ, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరమని ఆమె అభిప్రాయపడ్డారు.

**మొదటిపేజీ తరువాయి**

# మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలి

సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత దక్కిన ఈ విజయాన్ని ఆ పార్టీ వర్గాలు చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణిస్తున్నాయి. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఇన్నాళ్లూ తనపై వచ్చిన ఆరోపణలు, పడిన నిందలను తలచుకుంటూ ఆయన కన్నీరు పెట్టుకున్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేని విధంగా ఎదుర్కొన్న ఈ సంక్షోభం నుంచి బయటపడటంపై ఆయన స్పందిస్తూ, అంతిమంగా సత్యమే గెలుస్తుందన్న మాటకు ఈరోజే నిదర్శనం దొరికిందని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై తమకు మొదటి నుంచి ఉన్న అపారమైన నమ్మకం నేడు నిజమైందని, నిజాయితీకి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. మద్యం కుంభకోణం అనేది పూర్తిగా కల్పితమని, కేవలం తమ పార్టీని రాజకీయంగా దెబ్బతీయడానికే ఈ కుట్రను సృష్టించారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎదుగుదలను ఓర్వలేకనే ప్రత్యర్థులు ఇలాంటి తప్పుడు కేసులను బనాయించారని ఆయన మండిపడ్డారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక సిట్టింగ్ ముఖ్యమంత్రిని ఇంటి నుంచి ఈడ్చుకెళ్లి జైలులో వేయడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు గొడ్డలిపెట్టు లాంటివని, అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట అని ఆయన ధ్వజమెత్తారు.

ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను దాదాపు రెండేళ్ల పాటు జైలులో ఉంచడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని కేజ్రీవాల్ విమర్శించారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న నాయకులను లక్ష్యంగా చేసుకుని వేధించారని ఆయన దుయ్యబట్టారు. పార్టీలోని ఐదుగురు కీలక నేతలను జైలులో ఉంచి, పార్టీ కార్యకలాపాలను స్తంభింపజేయాలని చూశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ తాము ఎక్కడా వెనక్కి తగ్గలేదని, ప్రజల కోసం పనిచేస్తూనే ఈ న్యాయపోరాటాన్ని కొనసాగించామని ఆయన వివరించారు.

తాను నిజాయితీతో పనిచేశానని, తనపై వేసిన తప్పుడు కేసులు నేడు కోర్టు ముందు వీగిపోయాయని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. కేజ్రీవాల్ అవినీతిపరుడు అంటూ నిరంతరం వార్తల్లో ప్రచారం చేయించారని, తన వ్యక్తిత్వాన్ని హననం చేసే ప్రయత్నం జరిగిందని ఆయన వాపోయారు. కానీ, ఈరోజు కోర్టు ఇచ్చిన తీర్పుతో తన స్వచ్ఛత ఏమిటో లోకానికి తెలిసిందని ఆయన అన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో




తనపై ఉన్న మచ్చ తొలగిపోయిందని, ఇది కేవలం తన విజయం మాత్రమే కాదని, ఢిల్లీ ప్రజల విజయం అని ఆయన అభివర్ణించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కేజ్రీవాల్ ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై జరిగిన రాజకీయం అంతా ప్రధాని మోదీ, అమిత్ షా కనుసన్నల్లోనే జరిగిందని ఆయన నేరుగా ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థి పార్టీలను అణచివేయాలని చూడటం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి వెన్నుపోటు రాజకీయాలకు తెరలేపారని, కానీ న్యాయదేవత కళ్ళు తెరిచి అసలైన నిజాలను బయటపెట్టిందని కేజ్రీవాల్ ఉద్ఘాటించారు. జైలులో ఉన్న సమయంలో తాను అనుభవించిన వేదన వర్ణనాతీతమని, శారీరకంగా కంటే మానసికంగా తనను కుంగదీయాలని చూశారని ఆయన గుర్తుచేసుకున్నారు. ఒక ముఖ్యమంత్రికి ఉండాల్సిన కనీస సౌకర్యాలను కూడా నిరాకరిస్తూ వేధించారని ఆయన ఆవేదన చెందారు. తనను అవినీతి పరుడిగా చిత్రించేందుకు శతవిధాలా ప్రయత్నించిన వారు నేడు ఏ మొహం పెట్టుకుని ప్రజల ముందుకు వస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ తీర్పుతో తమ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రజల విశ్వాసాన్ని మళ్లీ చూరగొంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అరవింద్ కేజ్రీవాల్ తన ప్రసంగంలో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. క్లిష్ట కాలంలో పార్టీ వెన్నంటి ఉండి, పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ ఈ విజయం అంకితమని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అడ్డంకులు ఎదురైనా ఎదుర్కొంటామని, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీ మోడల్ పాలనను చూసి భయపడి ఇలాంటి కుట్రలు చేశారని, ఇకపై రెట్టింపు ఉత్సాహంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. లిక్కర్ పాలసీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ దాఖలైన చార్జ్ షీట్లలో వాస్తవాలు లేవని కోర్టు గ్రహించిందని ఆప్ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. కేజ్రీవాల్‌తో పాటు సిసోడియా, సంజయ్ సింగ్ వంటి నేతలకు విముక్తి కలగడం పార్టీకి పెద్ద బలాన్ని చేకూర్చింది. రానున్న ఎన్నికల్లో ఈ విజయం తమకు అనూహ్యమైన మైలేజీని ఇస్తుందని వారు భావిస్తున్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు న్యాయస్థానం గట్టి సమాధానం చెప్పిందని ఆ పార్టీ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

# అయ్యో యూరియా..!




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో గత వానాకాలం సీజన్ నుండి మొదలైన యూరియా కొరత ఛాయలు నేటికీ అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఎరువుల కొరత లేదని, నిల్వలు పుష్కలంగా ఉన్నాయని పాలకులు ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఒకప్పుడు తెల్లవారుజామునే లేచి దుకాణాల ముందు క్యూ కట్టిన రైతు, ఇప్పుడు చేతిలో స్మార్ట్ ఫోన్ పట్టుకుని యాప్ కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వాల్సిన సమయంలో, బస్తా యూరియా కోసం పగలు రేయి తేడా లేకుండా అగచాట్లు పడుతుండటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వం బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టే ఉద్దేశంతో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన యాప్ విధానం రైతులకు వరప్రసాదం కాకపోగా, శాపంగా పరిణమించింది. రాష్ట్రంలోని సుమారు 90 శాతం మంది రైతుల వద్ద నేటికీ సాధారణ కీప్యాడ్ ఫోన్లే ఉండటం ఈ సమస్యకు ప్రధాన కారణంగా మారుతోంది. యాప్ అంటే ఏమిటో, దాన్ని ఎలా వాడాలో తెలియని వృద్ధ రైతులు, మహిళా రైతులు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. సొసైటీల వద్దకు వెళ్లి సిబ్బందితో బుక్ చేయించుకోవాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, దీనివల్ల అమూల్యమైన సమయం వృథా అవుతోందని లక్షలాది మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం రికార్డు స్థాయిలో 27 లక్షల ఎకరాలకు పైగా పెరగడంతో యూరియాకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. అయితే, దానికి తగ్గట్టుగా సరఫరా లేకపోవడం, రామగుండం ఆర్ఎఫ్సీఎల్ ప్లాంట్‌లో తరచూ తలెత్తుతున్న సాంకేతిక లోపాలు రైతుల కష్టాలను రెట్టింపు చేశాయి. సాగు పెరిగినప్పుడే ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలమైన వ్యవసాయ శాఖ, ఇప్పుడు సమస్యను కేంద్రం వైపు నెట్టే ప్రయత్నం చేస్తోంది. కేంద్రం నుండి ఆశించిన స్థాయిలో కేటాయింపులు అందడం లేదని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం నిల్వలు మాయమవుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

యూరియా పంపిణీ విషయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల మధ్య రాజకీయ యుద్ధం తారాస్థాయికి చేరింది. గతంలో తమ హయాంలో ఆరు నెలల ముందే ప్రణాళికలు సిద్ధం చేసేవాళ్లమని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తుండగా, కేంద్రం పంపిన నిల్వలు ఎక్కడికి పోయాయని బీజేపీ ప్రశ్నిస్తోంది. అక్టోబర్ 2024 నుండి మార్చి 2025 మధ్య కాలంలో కేంద్రం నిర్దేశించిన దానికంటే ఎక్కువగానే యూరియా సరఫరా చేసిందని, సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల మిగులు స్టాక్ ఉన్నప్పటికీ రైతులకు ఎందుకు అందడం లేదని విపక్షాలు నిలదీస్తున్నాయి. ఈ రాజకీయ ఆరోపణల మధ్య రైతు మాత్రం సంచి కోసం రోడ్డెక్కక తప్పడం లేదు.

ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాల్లో యూరియా కోసం నిరసనలు మిన్నంటుతున్నాయి. సూర్యాపేట జిల్లా చిలుకూరులో రైతులు పురుగుల మందు డబ్బాలు పట్టుకుని ధర్నాకు దిగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గ్రామంలో అవసరమైన దానికంటే కేవలం పావు వంతు మాత్రమే నిల్వలు పంపడం వల్ల రైతుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. ఒకవైపు యాసంగి సీజన్ ముగుస్తున్న తరుణంలో, పంటకు అత్యవసరమైన సమయంలో యూరియా అందకపోతే దిగుబడి భారీగా దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. యాప్ విధానంలోని లోపాలు నల్లబజారు వ్యాపారులకు వరంగా మారాయి. రైతులకు యాప్ ద్వారా స్టాక్ లేదని చూపిస్తున్న సమయంలోనే, వెనుక దారిలో బస్తాలు వ్యాపారుల చేతుల్లోకి మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. యాప్‌లో బుక్ చేసుకుని తీరా సొసైటీ కేంద్రానికి వెళ్లేసరికి 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయని, దీంతో రైతులు మానసిక వేదనకు గురవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం లాంటి మారుమూల జిల్లాల్లోని రైతులు తమ పిల్లల స్మార్ట్ ఫోన్ల ద్వారా బుకింగ్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నా, సర్వర్ సమస్యలు వారిని వెక్కిరిస్తున్నాయి.

నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ మొదలుకుని నల్లగొండ జిల్లా పానగల్ వరకు ధర్నాలు, వినతిపత్రాల పర్వం కొనసాగుతోంది. సీపీఎం లాంటి ప్రజా సంఘాలు రైతులకు మద్దతుగా రోడ్ల మీదకు వస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం కారణంగానే సామాన్య రైతు బలిపశువు అవుతున్నాడని వారు మండిపడుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పలుమార్లు ఢిల్లీ వెళ్లి విన్నవించినా, ఫలితం మాత్రం శూన్యంగానే కనిపిస్తోంది. యుద్ధ ప్రాతిపదికన యూరియా నిల్వలు పెంచి, పంపిణీ వ్యవస్థను సరళతరం చేయాలని రైతాంగం ముక్తకంఠంతో కోరుతోంది. ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయి. ఈ సమయంలో యూరియా వేయకపోతే చేతికొచ్చిన పంట చేజారిపోతుందని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిస్తేజం వీడి, క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించాల్సిన అవసరం ఉంది. యాప్ విధానం ద్వారా సాంకేతికతను జోడించడం మంచిదే అయినా, అది రైతుకు భారంగా మారకూడదు. స్మార్ట్ ఫోన్ లేని రైతుకు కూడా సులభంగా యూరియా అందేలా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, యూరియా యాప్ విధానాన్ని రద్దు చేయాలని లేదా దానిని మరింత సరళతరం చేయాలని డిమాండ్ పెరుగుతోంది. పాత పద్ధతిలోనే నేరుగా ఆధార్ కార్డు ద్వారా లేదా ఫింగర్ ప్రింట్ ద్వారా బస్తాలను అందజేస్తే గందరగోళం తగ్గే అవకాశం ఉంది. అలాగే, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటేనే నిల్వలు రైతులకు చేరుతాయి. కేవలం మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో రైతు పక్షపాతి అని నిరూపించుకోవాల్సిన బాధ్యత సర్కారుపై ఉంది. రాబోయే వానాకాలం సీజన్ నాటికైనా ఈ సమస్య పరిష్కారం కాకపోతే రాష్ట్రంలో 'యూరియా యుద్ధం' తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి, బఫర్ స్టాక్ పెంచడంతో పాటు పంపిణీలో పారదర్శకత తీసుకురావాలి. అప్పుడే అన్నదాత ఆత్మవిశ్వాసంతో సాగు పనులు చేసుకోగలడు. రైతుల కష్టాలను కళ్లారా చూస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం ఇకనైనా మేల్కొని, అన్నదాతకు వెన్నుదన్నుగా నిలవాలని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు.



# మాజీ మావోయిస్టులకు సర్కార్ అభయం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయ, సామాజిక ముఖచిత్రంలో ఒక కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర సచివాలయం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆరుగురు మాజీ మావోయిస్టు అగ్రనేతలు భేటీ కావడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాల కాలం పాటు అడవుల్లో సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన నేతలు, నేడు ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసంతో ముఖ్యమంత్రిని కలవడం ఒక సానుకూల పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశంలో పొలిటికల్ ఎజెండాతో పాటు మాజీ మావోయిస్టుల పునరావాసం, వారి భవిష్యత్తు కార్యచరణపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో మాజీ మావోయిస్టు నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు ఉన్నారు. ఇన్నేళ్లపాటు అడవుల్లో కఠినమైన జీవనాన్ని గడిపి, ప్రజాస్వామ్య బాట పట్టినందుకు ముఖ్యమంత్రి వారిని ప్రత్యేకంగా అభినందించారు. హింస అనేది సమాజంలో ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారాన్ని చూపలేదని, కేవలం శాంతియుత పోరాటాలు, ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారానే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మార్పు రావాల్సింది తుపాకీ గొట్టం ద్వారా కాదని, ప్రజాస్వామ్య విలువల ద్వారా అని ఆయన ఉద్ఘాటించారు.

ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ మావోయిస్టులకు ఒక స్పష్టమైన భరోసా ఇచ్చారు. ప్రధాన స్రవంతిలో కలిసిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి సంపూర్ణ భద్రత కల్పించడమే కాకుండా సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలలో వారు కూడా భాగస్వాములు కావాలని సీఎం ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యంపై నమ్మకంతో వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై డీజీపీ శివధర్ రెడ్డి ఈ సమావేశంలో కీలక గణాంకాలను వెల్లడించారు. గత రెండేళ్ల కాలంలోనే సుమారు 591 మంది మావోయిస్టులు వివిధ కారణాలతో జనజీవన స్రవంతిలో కలిశారని ఆయన తెలిపారు. పోలీసు యంత్రాంగం యొక్క సమన్వయం, ప్రభుత్వం అమలు చేస్తున్న మెరుగైన పునరావాస విధానాల వల్ల చాలా మంది అడవులను వీడి వస్తున్నారని వివరించారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయం అందించడంతో పాటు, వారిపై ఉన్న కేసుల విషయంలో చట్టపరమైన వెసులుబాటు కల్పించే అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

ముఖ్యమంత్రిని కలిసిన మాజీ మావోయిస్టు నేతలు తమకు ఈ అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అడవుల్లో ఉండి పోరాడటం కంటే, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజల సమస్యల కోసం పని చేయడం మిన్న అని తాము గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. అయితే, పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి ప్రాంతాల్లో అమలు చేస్తున్న తరహాలో తెలంగాణలో కూడా మెరుగైన పునరావాస ప్యాకేజీలను అందించాలని వారు కోరారు. ఆర్థిక తోడ్పాటుతో పాటు ఇళ్ల స్థలాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తే మరింత మంది ప్రధాన స్రవంతిలోకి వచ్చే అవకాశం ఉందని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

మాజీల వినతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. పొరుగు రాష్ట్రాల పునరావాస ప్యాకేజీలను అధ్యయనం చేసి, అంతకంటే మెరుగైన ప్రయోజనాలను తెలంగాణలో కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. మాజీ మావోయిస్టుల కుటుంబాల సంక్షేమం కూడా ప్రభుత్వ బాధ్యతని, వారి పిల్లల చదువులకు, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎస్ మరియు డీజీపీలకు సూచించారు. సాయుధ పోరాటాన్ని వీడిన వారు తిరిగి అభద్రతా భావానికి గురికాకుండా చూడటమే తమ లక్ష్యమని సీఎం అన్నారు.

ఈ కీలక సమావేశంలో కేవలం ముఖ్యమంత్రే కాకుండా ప్రభుత్వ ఉన్నత స్థాయి బృందం పాల్గొంది. ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డిలతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఐజీ సుమతి వంటి ఉన్నతాధికారులు చర్చల్లో భాగస్వాములయ్యారు. పరిపాలన, భద్రతాపరమైన అంశాలను సమన్వయం చేసుకుంటూ మాజీ మావోయిస్టులకు ఎలా అండగా ఉండాలో ఒక కార్యాచరణను సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఇది రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు కూడా దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

మాజీ మావోయిస్టులు ప్రధాన స్రవంతిలోకి రావడం అనేది కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదని, అది ఒక సామాజిక మార్పుకు సంకేతమని సలహాదారులు పేర్కొన్నారు. దశాబ్దాలుగా నక్సలైట్ సమస్యతో సతమతమైన ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని, రహదారులు, విద్యుత్, విద్య వంటి ప్రాథమిక సౌకర్యాలు అట్టడుగు వర్గాలకు చేరుతున్నాయని వారు వివరించారు. ప్రభుత్వంపై నమ్మకంతో వచ్చిన మాజీ నేతలు, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఒక వారధిలా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సమావేశం అనంతరం మాజీ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తమ మాటలను ఓపికగా విన్నారని, తమ భద్రత పట్ల ఆయన చూపిన చొరవ ధైర్యాన్ని ఇచ్చిందని వారు మీడియాతో చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక ముఖ్యమంత్రి తమతో నేరుగా భేటీ అయి సమస్యలను చర్చించడం సానుకూల పరిణామమని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ప్యాకేజీల విషయంలో సీఎం ఇచ్చిన హామీ నెరవేరితే, అడవుల్లో ఉన్న మరికొంత మంది తమ ఆలోచనను మార్చుకునే అవకాశం ఉందని వారు విశ్లేషించారు.

## కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ

**మహిళా సమైక్య ఆధ్వర్యంలో కోవత్తుల ర్యాలీ**

**బోడుప్పల్, విశాలభారతి:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బోడుప్పల్ సర్కిల్ 10వ, డివిజన్‌లో భగత్ సింగ్ నగర్ కాలనీలో మహిళ సమైక్య మేడిపల్లి మండల కార్యదర్శి సిహెచ్ మాధవి ఆధ్వర్యంలో కుమ్మెర ఘటన నిరసనగా కోవత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడారు. ఘోరాతి ఘోరమైన మానవత్వానికి మచ్చ తెచ్చే విధంగా చిన్నారిని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లన్న జాతరలో చిన్నారి తల్లి దర్శనం అడిగినందుకు ఆ పాపను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. దేవుడు దర్శనం అడిగిన పాపానికి.. దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారని ఆగ్రహించారు. ఈ దారుణానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందేనని హెచ్చరించారు. పసిగుడ్డు ముఖం చూసి తండ్రిని వదిలిపెట్టమని ప్రాధేయపడ్డ.. వదలకుండా కాలితో ఆ పాపను తన్నితే చనిపోయింది.. రెండు నెలల పసిగుడ్డుకు కులం తెలుసా..?, మనుషులను చిన్నచూపు చూసి దర్శనానికి రానివ్వకుండా చేయడం ఘోరం. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సిందే. శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి పొత్తిళ్లలోని పసిగుడ్డును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు.బీసీ సంఘం జిల్లా నాయకులు కే ప్రమీల, బి కే యం యు మండల కార్యదర్శి కే మహాలక్ష్మి, మహిళా సమైక్య నాయకులు మేకల లక్ష్మి, జానకమ్మ, రత్నమ్మ, మమత, శోభ, జయమ్మ, అండమ్మ, సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, ఉపేందర్, మల్లేష్, మేడ నరసయ్య, శంకరయ్య, సిద్ధులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆనందాపురంలో రగులుతున్న వివాదాలు

**రెండు పార్టీల నాయకుల మధ్య పోరు.. పోలీసులకు ఇబ్బందిగా మారిన వైరాలు**

**ఆదిలోనే అదుపు చేయాలంటున్న జనం .. ఓ వర్గంవారిపై కేసులు నమోదు**



**అశ్వాపురం, విశాలభారతి:** మండల పరిధిలోని ఆనందాపురం గ్రామంలో వివాదాలు ఆరనిచ్చిచ్చులా రగులుతున్నాయి. ఈ గొడవలు కొత్తగా జరుగుతున్నవి కావు. ఏళ్ల తరబడి నడుస్తున్న వైరాలు. సాధారణంగా గ్రామాలలో ఎన్నికల సందర్భాల్లోనే రాజకీయంగా తామెంటో నిరూపించుకునేందుకు నాయకులు పోటీలు పడుతుంటారు. ఈ నేపథ్యంలో వర్గాలుగా చీలికలై వారి మాట నెగ్గించుకునేందుకు ఎత్తుల, జిత్తులతో రాజకీయాలు చేస్తూ చిన్న చిన్న kవివాదాలు పెట్టుకుంటుంటారు. ఎన్నికల అనంతరం గొడవలు సర్దుమనిగి ఎవరు పనులలో వాళ్ళు నిమగ్నం అవుతుంటారు. కానీ ఆనందాపురం గ్రామంలో విచిత్రం ఏమిటంటే ఇది 365 రోజులు రావనకాష్టంలా వివాదాలు జరుగుతూనే ఉంటాయి. ఓ రెండు వర్గాలకు మధ్యన జరిగే గొడవలకు రాజకీయ రంగు పులిమి పచ్చని పల్లెను రగులుతున్న కొలిమిలా తయారయ్యేలా చేస్తున్నారు.

**ఆనందాపురం గ్రామంలో ప్రస్తుతం వివాదం ఎలా మొదలైంది అంటే..**

ఆనందాపురం గ్రామానికి చెందిన కొందరు గిరిజనుల పూర్వికులు సుమారు 50, 60 ఏళ్ల క్రితం గోదావరి సమీపాన టేకులగూడెం అనే గ్రామాన్ని ఏర్పరచుకునీ కొన్నేళ్లుగా అక్కడ జీవనాన్ని కొనసాగించారు. కొన్నేళ్ల తర్వాత అక్కడ గిరిజనుల జీవనానికి సౌలభ్యతగా లేకపోవడం, వర్షాకాలంలో గోదావరి ఇబ్బందులు తలెత్తడం తో కాలక్రమేనా గ్రామం ఇప్పుడున్న ఆనందపురానికి చేరుకున్నారు. అలా ఖాళీ అయిన భూమిని అదే గ్రామానికి చెందిన ఊస అనిల్ కొంత ఆయన తల్లి కొండాయమ్మ కొంతమేరకు పట్టాలు చేయించుకున్నారని ఆ భూమి మా తాతలనాటిది కనుక మాకే చెందాలని ఇటీవల ఆ గ్రామానికి చెందిన గిరిజనులు ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీరికి మద్దతుగా ఆ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు సూది రెడ్డి గోపాలకృష్ణారెడ్డి మద్దతు తెలిపాడు. ఇక అక్కడ నుండి మొదలైన వివాదం చిలికి చిలికి గాలి వానలా పోలీస్ స్టేషన్ వరకు చేరింది. దీంతో గురువారం పోలీస్ స్టేషన్కు ఫిర్యాదులు చేసుకోవడానికి వచ్చిన ఉషా అనిల్ ను గోపి రెడ్డి తో పాటు అతని వర్గీయుల తిట్టారని కేసు పెట్టాడు. దీంతో అశ్వాపురం సిఐ గోపిరెడ్డి, కాట్రాజ్ కొండలరావు, సత్యనారాయణ, సర్పంచ్ ముర్రం సమ్మయ్య, దేవనబోయిన మహేష్ సహా మరో పదిమందిని శుక్రవారం ఉదయాన్నే పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చారు. కేసులు కూడా నమోదు చేశారు.

# కాంగ్రెస్ ఇంకా నేర్చుకోలేదా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను కబ్జాకోరుల నుంచి విడిపించాలనే గట్టి పట్టుదలతో ఉంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అస్తవ్యస్తమైన నగర నిర్మాణాలను చక్కదిద్దేందుకు హైడ్రా వంటి విభాగాలను రంగంలోకి దించడం ప్రశంసనీయమైన చర్యే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఈ ఆపరేషన్లను నిర్వహిస్తున్న తీరు తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ భూములను కాపాడటం బాధ్యతైనప్పటికీ, ఆ ప్రక్రియలో అనుసరిస్తున్న అనాలోచిత వ్యూహాలు ప్రజల్లో సానుకూలత కంటే భయాందోళనలనే ఎక్కువగా కలిగిస్తున్నాయి. ఏ ప్రభుత్వమైనా సంస్కరణలు చేపట్టినప్పుడు దానికి ముందస్తు కసరత్తు అవసరం, కానీ ఇక్కడ యంత్రాంగం కేవలం కూల్చివేతలకే పరిమితమవుతోందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కూల్చివేత వెనుక చట్టబద్ధత ఉన్నప్పటికీ, ఆ కట్టడాలను తొలగించే ముందు బాధితులకు తగిన సమయం ఇవ్వకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. రాత్రికి రాత్రి భారీ పోలీసు బందోబస్తుతో జెసిబిలను పంపి గూడు చెడగొట్టడం వల్ల సామాన్యుల్లో ప్రభుత్వంపై ఆగ్రహం పెరుగుతోంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన నివాసాల విషయంలో ప్రభుత్వం మరింత మానవీయ కోణంలో ఆలోచించాల్సి ఉంది. కేవలం యంత్రాలతో కూల్చేయడం సులభమే కానీ, ఆ తర్వాత ఉత్పన్నమయ్యే మానసిక, సామాజిక సంక్షోభాన్ని ఎదుర్కోవడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారుతోంది. ఇది చివరకు ప్రజల్లో 'పేదల వ్యతిరేక ప్రభుత్వం' అనే ముద్ర పడటానికి దారితీస్తోంది. ఖమ్మం జిల్లాలో ఇటీవల జరిగిన భూదాన్ భూముల కూల్చివేత ఉదంతం ప్రభుత్వ వ్యూహాత్మక వైఫల్యానికి ఒక స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తోంది. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్నప్పుడే యంత్రాంగం మేలుకొని ఉంటే ఇంతటి నష్టం జరిగి ఉండేది కాదు.

అక్కడ శాశ్వత నిర్మాణాలు పూర్తయి, ప్రజలు గృహప్రవేశాలు చేసిన తర్వాత కోర్టు ఆదేశాల పేరుతో ఒక్కసారిగా ఇళ్లను నేలమట్టం చేయడం రాజకీయంగా ప్రతిపక్షాలకు అస్త్రాలను అందించింది. ఆక్రమణల మొదట్లోనే కఠినంగా వ్యవహరించి ఉంటే బాధితులకు ఆర్థిక నష్టం తప్పేది, ప్రభుత్వానికి కూడా ఇన్ని విమర్శలు ఎదురయ్యేవి కావు. మూసీ నది ప్రక్షాళన విషయంలోనూ ప్రభుత్వం ఇదే తరహా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. నదీ గర్భంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించడం చట్టపరంగా అనివార్యం అయినప్పటికీ, బాధితులకు ప్రత్యామ్నాయం చూపడంలో ప్రభుత్వం విఫలమైందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టే యంత్రాంగం ప్రభుత్వానికి లోపించింది. బాధితుల కన్నీటి గాథలు నెట్టింట వైరల్ అవుతుండటంతో, ప్రభుత్వం చేస్తున్న మంచి పని కూడా ప్రజల దృష్టిలో తప్పుడు నిర్ణయంగా ముద్ర పడుతోంది. పబ్లిక్ రిలేషన్స్ విషయంలో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలకు, ప్రజల అవగాహనకు మధ్య ఉన్న 'కమ్యూనికేషన్ గ్యాప్' రోజురోజుకూ పెరుగుతోంది. ఏ భూమిని ఎందుకు స్వాధీనం చేసుకుంటున్నారు, అక్కడ చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి అనే విషయాలను స్థానికులకు ముందే వివరించాలి. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రజలతో మమేకమై వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. అలా కాకుండా హఠాత్తుగా రంగ ప్రవేశం చేయడం వల్ల ప్రభుత్వంపై నమ్మకం సడలుతోంది. ఏ ఆక్రమణనైనా తొలగించే ముందు ఆ ప్రాంతంలో ముందస్తుగా విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజలను మానసిక సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏదైనా పెద్ద మార్పును కోరుకున్నప్పుడు ప్రభుత్వం కఠినంగా ఉండటం సహజమే కానీ, ఆ కఠినత్వం సామాన్యుల జీవితాలను చిన్నాభిన్నం చేయకూడదు. ఆక్రమణదారులు పెద్ద తలకాయలైనా, సామాన్యులైనా చట్టం ముందు ఒక్కటే అయినప్పటికీ, పేదల విషయంలో పునరావాస ప్యాకేజీలను ముందే ప్రకటించడం మేలు. ప్రజలకు భరోసా కల్పించకుండా కేవలం బుల్డోజర్లనే నమ్ముకుంటే అది రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. యంత్రాంగం కేవలం కూల్చివేత సాధనంగా కాకుండా, పరిష్కార మార్గాలను చూపే దిశగా పని చేయాలి. అప్పుడే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుంది. ప్రజల మద్దతు కూడా లభిస్తుంది. ప్రతిపక్షాలు ఈ కూల్చివేతలను మానవ హక్కుల ఉల్లంఘనగా చిత్రీకరిస్తూ రాజకీయ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. కేవలం అధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగా కాకుండా, వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకోవాలి. కూల్చివేతల వల్ల ఎన్ని ఎకరాల భూమి తిరిగి ప్రభుత్వానికి చేరిందనే గణాంకాల కంటే, దానివల్ల ఎంతమంది ప్రజలు ఆగ్రహానికి గురయ్యారనేది ప్రజాస్వామ్యంలో ముఖ్యం. సంస్కరణలు అనేవి ప్రజల ప్రయోజనం కోసమేనని వారు నమ్మినప్పుడే ఆ ప్రభుత్వానికి అసలైన విజయం దక్కుతుంది. లేనిపక్షంలో ఈ వివాదాలు రాబోయే ఎన్నికల్లో ఓట్ల రూపంలో నష్టం కలిగించే ప్రమాదం ఉంది. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం లోపించడం కూడా ఈ సమస్యలకు మరో కారణం. ఒక శాఖ అనుమతులు ఇస్తుంటే, మరో శాఖ ఆ కట్టడాలను అక్రమమని కూల్చివేస్తుంటే ప్రజల్లో గందరగోళం ఏర్పడుతోంది. ముందుగా అన్ని శాఖలను సమన్వయం చేసి, ఏవి అక్రమ కట్టడాలనే దానిపై స్పష్టమైన జాబితాను ప్రజల ముందుంచాలి. పారదర్శకత లేని చోట పుకార్లు పుట్టుకొస్తాయి, ఆ పుకార్లే ప్రభుత్వానికి వ్యతిరేక గాలిని సృష్టిస్తాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకొని, ఆక్రమణల తొలగింపులో ఒక క్రమబద్ధమైన విధానాన్ని అమలు చేయాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం సామాన్యులకు అర్థమవుతుంది. నిజానికి గత ప్రభుత్వాల హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సాహసోపేత నిర్ణయాలు తీసుకుంది. అయితే ఈ సాహసం వివాదాలకు తావు లేకుండా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరం. బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరిస్తూనే, ఆక్రమణలను అడ్డుకోవడంలో తెగింపు చూపాలి. మానవీయ కోణాన్ని విస్మరించిన ఏ సంస్కరణ కూడా దీర్ఘకాలంలో విజయవంతం కాదు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపిస్తూ ముందుకు సాగితేనే ప్రభుత్వం ఆశించిన 'క్లీన్ సిటీ', 'కబ్జా రహిత సమాజం' సాధ్యమవుతాయి. ప్రభుత్వం తన పనితీరులో వేగాన్ని ఎంతైతే ప్రదర్శిస్తోందో, అంతే నిలకడను, విచక్షణను కూడా ప్రదర్శించాలి. ఆక్రమణలను తొలగించడం ప్రభుత్వ బాధ్యతే కానీ, అది రాజకీయ వివాదంగా మారకుండా జాగ్రత్త పడటం రాజనీతిజ్ఞత అనిపించుకుంటుంది. ఇప్పటికైనా జరిగిన లోపాల నుంచి పాఠాలు నేర్చుకొని, కమ్యూనికేషన్ గ్యాప్‌ను భర్తీ చేస్తూ, ప్రజలను విశ్వాసంలోకి తీసుకుంటేనే ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. లేదంటే ప్రతి జెసిబి కదలిక ఒక కొత్త వివాదానికి తెరలేపుతూనే ఉంటుంది.



# అఫ్గానిస్తాన్‌పై పాక్ యుద్ధం

**విశాలభారతి, జాతీయం:**

దక్షిణాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. చిరకాల మిత్రదేశాలైన పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య దశాబ్దాల వైరం ఇప్పుడు బహిరంగ యుద్ధానికి దారి తీసింది. గత కొంతకాలంగా సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతలు ఒక్కసారిగా కట్టలు తెంచుకోవడంతో, ఇరు దేశాలు పరస్పర దాడులతో విరుచుకుపడుతున్నాయి. ముఖ్యంగా పాకిస్థాన్ సైన్యం ఏకంగా అఫ్గాన్ రాజధాని కాబుల్‌ను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులకు పాల్పడటం అంతర్జాతీయ సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలను పూర్తిగా తెంచివేసి, రణరంగాన్ని తలపిస్తోంది. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సోషల్ మీడియా వేదికగా చేసిన సంచలన ప్రకటన యుద్ధ తీవ్రతను అద్దం పడుతోంది. తమ సహనం నశించిందని, ఇకపై దొంగచాటు దాడులు ఉండవని, అఫ్గానిస్థాన్‌తో నేరుగా బహిరంగ యుద్ధమేనని ఆయన ప్రకటించారు. 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్' పేరుతో పాక్ వైమానిక దళం అఫ్గాన్ గడ్డపై బాంబుల వర్షం కురిపిస్తోంది. కాబుల్, కాందహార్, పక్తియా వంటి కీలక ప్రావిన్స్‌లలో సైనిక స్థావరాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఈ దాడులు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ఈ భీకర దాడులపై అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా స్పందిస్తూ పాక్ చర్యలను తీవ్రంగా ఖండించారు. పాక్ వైమానిక దాడుల్లో తమ వైపు ఆస్తి నష్టం సంభవించినా, ప్రాణ నష్టం జరగలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, పాక్ దుశ్చర్యకు ప్రతీకారంగా తాము చేపట్టిన ఎదురుదాడుల్లో ఏకంగా 55 మంది పాక్ సైనికులు ప్రాణాలు కోల్పోయారని ఆయన సంచలన ప్రకటన చేశారు. సరిహద్దు వెంబడి అఫ్గాన్ దళాలు శక్తివంచన లేకుండా పోరాడుతున్నాయని, తమ భూభాగాన్ని రక్షించుకునేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమని జబీహుల్లా ప్రకటించారు. అఫ్గాన్ ప్రకటనను పాకిస్థాన్ తీవ్రంగా తోసిపుచ్చింది. పాక్ ప్రభుత్వ ప్రతినిధి మోషరఫ్ అలీ జైదీ మాట్లాడుతూ, అఫ్గాన్ చెబుతున్న గణాంకాలు అవాస్తవమని కొట్టిపారేశారు. తమ దాడుల్లో 150 మందికి పైగా అఫ్గాన్ సైనికులు హతమయ్యారని ఆయన వెల్లడించారు. ఉగ్రవాద స్థావరాలను అఫ్గాన్ ప్రోత్సహిస్తోందని, అందుకే తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సమర్థించుకున్నారు. ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం కాస్తా ఇప్పుడు రక్తపాతానికి దారితీసి, సరిహద్దు గ్రామాలను భయం గుప్పిట్లోకి నెట్టేసింది.




యుద్ధం ముదురుతున్న క్రమంలో అఫ్గానిస్థాన్ తన అత్యంత ప్రమాదకరమైన 'ఆత్మాహుతి దళాన్ని' రంగంలోకి దించింది. ఈ మేరకు అఫ్గాన్ ప్రభుత్వ మీడియా విడుదల చేసిన ఫోటోలు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి. భారీ పేలుడు పదార్థాలతో కూడిన దుస్తులు ధరించిన వందలాది మంది ఆత్మాహుతి సభ్యులు పాక్ కీలక లక్ష్యాలపై దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ ఫోటోలు స్పష్టం చేస్తున్నాయి. ఇది యుద్ధాన్ని మరో ప్రమాదకర స్థాయికి తీసుకెళ్లే సూచనగా విశ్లేషకులు భావిస్తున్నారు.

డ్యూరండ్ లైన్ వెంబడి ప్రస్తుతం పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా ఉంది. ఇరు దేశాల సైన్యాలు భారీ ఆయుధ సామగ్రితో మోహరించాయి. క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం, పాకిస్థాన్‌కు చెందిన ఒక ఎఫ్16 యుద్ధ విమానాన్ని అఫ్గాన్ దళాలు విజయవంతంగా కూల్చివేసినట్లు తెలుస్తోంది. తమ గగనతలంలోకి అక్రమంగా ప్రవేశించినందుకే ఈ చర్య తీసుకున్నట్లు అఫ్గాన్ వర్గాలు చెబుతున్నాయి. విమానం కూలిపోయిన ఘటనపై పాక్ ఇంకా అధికారికంగా స్పందించనప్పటికీ, ఇది పాక్ సైన్యానికి పెద్ద దెబ్బగానే భావించవచ్చు. సరిహద్దుల్లోని పౌరులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. నిరంతర కాల్పులు, షెల్ దాడుల మోతతో సరిహద్దు ప్రాంతాలు దద్దరిల్లుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అఫ్గాన్ ప్రభుత్వం ఈసారి పాకిస్థాన్‌ను నేరుగా ఢీకొనేందుకు సిద్ధమవ్వడం గమనార్హం. గతంలో తాలిబన్లకు సహకరించిన పాకిస్థానే ఇప్పుడు వారి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవడం ఒక విచిత్రమైన పరిణామం. ఇది కేవలం సరిహద్దు వివాదం మాత్రమే కాక, ప్రాంతీయ ఆధిపత్య పోరుగా మారుతోంది. అంతర్జాతీయ సమాజం ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. ఐక్యరాజ్యసమితి సహా పలు దేశాలు ఇరుపక్షాలు సంయమనం పాటించాలని కోరుతున్నా, పరిస్థితి అదుపు తప్పుతున్నట్లు కనిపిస్తోంది. యుద్ధం గనుక ఇలాగే కొనసాగితే దక్షిణ ఆసియాలో అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా అఫ్గాన్‌లో నెలకొన్న ఆర్థిక సంక్షోభం, పాకిస్థాన్‌లో ఉన్న రాజకీయ అస్థిరత ఈ యుద్ధం వల్ల మరింత ముదిరే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య చర్చలకు అవకాశం లేనంతగా వైరం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్ అంతర్గత భద్రతా కారణాలను సాకుగా చూపి అఫ్గాన్ పై దాడులు చేస్తుంటే, అఫ్గాన్ మాత్రం తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటామని భీష్మిస్తోంది. క్షిపణులు, రాకెట్ దాడులతో సరిహద్దు దాటి పరస్పరం దాడులు చేసుకోవడం వల్ల సామాన్య ప్రజలు బలైపోతున్నారు. ఆత్మాహుతి దళాల వినియోగం గనుక జరిగితే, అది పెను విధ్వంసానికి దారితీస్తుంది. ఉగ్రవాద సంస్థలు ఈ అస్థిరతను ఆసరాగా చేసుకుని మరిన్ని దాడులకు పాల్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతానికి ఇరు దేశాల మధ్య శాంతి చర్చల ఊసే వినిపించడం లేదు. ఒకవైపు గగనతల దాడులు, మరోవైపు భూతల పోరాటంతో సరిహద్దు నివురు గప్పిన నిప్పులా ఉంది. ఏ క్షణంలోనైనా ఈ చిన్నపాటి ఘర్షణలు పూర్తిస్థాయి యుద్ధంగా మారి మొగ్గు ఎటువైపు తిరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ రక్తపాతానికి స్వస్తి పలికి శాంతి దిశగా అడుగులు పడకపోతే, ఇరు దేశాలకు భారీ మూల్యం తప్పదు. రానున్న కొన్ని గంటలు ఈ ప్రాంత భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## నరసింహ స్వామి దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక




**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలోని శ్రీ వానకొండయ్య నరసింహస్వామి దేవస్థానం నూతన కమిటీని గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఈరోజు ఘనంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి ఉత్సావాల నిర్వహణ మరియు భక్తులకు సౌకర్యాల కల్పన లక్ష్యంగా ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. చైర్మన్ గా చెన్నూరి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి గా సుడిగాల మల్లేష్, కోశాధికారిగా దొరగాని కృష్ణ, కమిటీ సభ్యులుగా పంతం సోమన్న, పెద్ద సందీప్, నక్క భాస్కర్, సుడిగాల నరేష్, కాడబోయిన యాకన్న, మల్లేష్, భాషిపాక ఉప్పలయ్య, వంగూరి వెంకన్న, పడమటింటి కుమార్, బాషిపాక అశోక్, అభిషేక్, పడమటింటి శ్రీకాంత్, నరసింహ చారి, రేషనల్ల శ్రీమాన్, జంపాల నవీన్, పైండ్ల సుధాకర్, అంజయ్య, దొంతిక మహేష్, ఎలకపల్లి బాలయ్య, తోట రవి, ఎడ్ల సోమనసయ్య, కాడబోయిన వినోద్ కుమార్, రేషనల్ల వంశీ, జిట్టే సంపత్, నల్ల రమేష్, ఉపేందర్, గుమ్మడవెల్లి శ్రీనివాస్, అజ్మీర విజయ్, జాటోత్ వీరన్న,మూడ రవి, బిట్ల ఉమేష్, తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. గ్రామ పెద్దలు భక్తులు నూతన కమిటీని అభిమా న అభినందనలు తెలియజేస్తూ, ఆలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని, ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రతినిధులు భక్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌కు గ్రామస్తుల వినతిపత్రం

**రాత్రి కరెంట్ కోతలు నిలిపివేయాలి**



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామ బీసీ కాలనీలో ఇండ్లపై నుంచి వెళ్లుతున్న 11 కేవీ విద్యుత్ లైన్ కారణంగా ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ విద్యుత్ లైన్‌ను వెంటనే మార్చాలని వారు విద్యుత్ విభాగం సహాయ ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి ప్రస్తుతం ముగిచెర్ల జగ్గయ్య తండా ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్నదని, రాత్రి సమయంలో రెండు నుంచి మూడు గంటల పాటు విద్యుత్ నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి బేతోలు 6వ వార్డుకు మహబూబాబాద్ పట్టణం నుంచి నేరుగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భూక్య రాంజి, షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, అనపర్తి మదన్, గూగులోత్ కిషన్, సిరికొండ కృష్ణ, షేక్ జావిద్, గుగులోత్ సోమ్లా, ఏనుగంటి వెంకన్న, భూక్య కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధి పై దృష్టి సారించాలి

**వాషింగ్ సెంటర్‌ను ప్రారంభించిన బత్తుల వాణి విప్లవ్ గౌడ్**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలో వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ దేవస్థానం పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన షాపు యజమాని ఏనుగుల లక్ష్మణ్,శివ సాయి వాషింగ్ సెంటర్ ను స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి..వారి చేతుల మీదగా వాషింగ్ సెంటర్ ను ప్రారంభించారు.తదనంతరం వారు మాట్లాడుతూ షాపు యజమాని ఏనుగుల లక్ష్మణ్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ..యువత స్వయం ఉపాధి పై దృష్టి సారించి,పట్టణ అభివృద్ధిలో భాగస్తులు కావాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ సందర్భంగా షాపు యజమానులు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్ ను శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## పకృతి వ్యవసాయంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు




**నిజామాబాద్, విశాలభారతి:** ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారిని పద్మ అన్నారు. మాక్లూర్ మండలంలోని గంగరమంద గ్రామంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పకృతి వ్యవసాయం సాగువలన రైతులకి,భూమికి,పర్యావరణానికి, ప్రధాన పంట వినియోగదారునికి కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె వివిధ రకాల విత్తనాలు వేయడం ద్వారా ఎకరాలకు వచ్చే పంట దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ దివ్య, స్థానిక సర్పంచ్ శోభ రవీందర్ పకృతి వ్యవసాయ సిబ్బంది దయవర్ భాగ్య , ఉషన్న స్వప్న, పంచాయతీ సెక్రటరీ క్రాంతి, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంతోనే గ్రామ అభివృద్ధి



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం ఏడ్జెర్లపల్లి గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎడ్జెర్లపల్లి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అందుకు కార్యకర్తలు, నాయకులు కొత్త ఉత్సాహంతో ముందుకు సాగితే ప్రజా ప్రభుత్వంలో గ్రామ అభివృద్ధి చెందుతుంది ప్రజల సమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ పార్టీ అనునిత్యం పనిచేస్తుందని, గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా ప్రజలను ఇబ్బందికి గురి చేశారని అన్నారు. ప్రాంతీయ పార్టీలతో ప్రజలకు న్యాయం జరిగేది ఏమీ లేదని ఒక కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అలాగే ఏడ్జెర్లపల్లి గ్రామపంచాయతీ బిల్డింగ్ ని అసంపూర్తిగా నిర్మాణం చేపట్టి గాలికి వదిలేసారని ఆయనకు తెలపడంతో గ్రామపంచాయతీ బిల్డింగ్ ను పరిశీలించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడ్డంతో అధికారులు స్పందించి దాన్ని త్వరగా పూర్తి చేపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్ట దామోదర్, ఉప సర్పంచ్ గంప నరసింహారావు, బోరా శ్రీనివాసరెడ్డి, చెన్నం మోహన్రావు, చెన్నం శరబాబు, నాంపల్లి నరసింహారావు, రామెళ్ళ శ్రీను, గార వెంకట నరసయ్య, చెన్నం ప్రశాంత్, కొండ గొర్ల శ్రీను, కొండ గొర్ల వెంకటేష్, చెన్నం శేషు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పుష్కరాల సమయానికి అవసరాలు ఏమిటి గుర్తించండి



**నిజామాబాద్, విశాలభారతి:**

కందకుర్తి పుష్కర ఘాటుని ప్రభుత్వ ముఖ్య సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సందర్శించారు. శుక్రవారం సాయంత్రం గోదావరి పుష్కర ఘాటులో ఉన్నటువంటి సౌకర్యాలను ఆయన పరిశీలించారు. గ్రామంలోని రామ మందిరం నుండి పుష్కర ఘాట్ వరకు ఆయన రోడ్లను ,స్నానాల గదులను మరుగుదొడ్లను విశ్రాంతి గదులను బట్టల మార్పిడి గదులను అన్నిటిని ఆయన స్వయంగా పరిశీలించారు. వాటి స్థితిగతులను చూశారు. వాటికి మరమ్మత్తుల ఖర్చు ఎంత మేరకు అవుతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో కోటిమంది పుణ్య స్థానాలు చేసినటువంటి త్రివేణి సంగమం కావడంతో గోదావరి తెలంగాణలో తొలి ప్రవేశంకల ప్రదేశం కావడంతో పుష్కరాలకు సుమారు కోటి మంది భక్తులు పుణ్య స్థానాలు చేస్తారని అభిప్రాయానికి వచ్చారు .గతంలో జరిగిన ఇబ్బందులు దృశ్య ఈసారి ఇబ్బందులు లేకుండా భక్తులకు అన్ని ఏర్పాట్లను చేసే విధంగా సంవత్సరం ముందే ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు ప్రస్తుతం మరమ్మత్తులు అవసరం ఉన్నటువంటి పనులను తొందరగా చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కావాలని వాటిని గుర్తించి ప్రణాళికను రూపొందించి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని ఆయన అధికారులను ఆదేశించారు .గతంలో జరిగినటువంటి ఇబ్బందులు ఇప్పుడు జరగకుండా ముందే ఏర్పాట్లను చూడాలని అధికారులను కోరారు. వచ్చే సంవత్సరం పుష్కరాల నాటికి తాగునీరు విద్యుత్ విశ్రాంతి బస్సు సౌకర్యాలు పార్కింగ్ భక్తుల స్థానాలకు పుష్కర ఘాట్లు భక్తులు ఏ మేరకు వస్తే ఎన్ని చోట్ల పార్కింగ్ చేసి ప్రభుత్వ బస్సుల ద్వారానే పుష్కర ఘాటుకు భక్తులను తీసుకురావాలా ?అన్ని విషయాలని క్లుప్తంగా అధ్యయనం చేయాలని ఆయన ఆదేశించారు. నిర్మాణపు పనులు ఉంటే వెంటనే గుర్తించి పనులను చేపట్టాలని ఆయన సూచించారు. అక్కడ ఉన్నటువంటి సీతారాం త్యాగి ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఆశ్రమానికి కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల విస్తీర్ణ తదితర విషయాలను అన్నిటిని ఆయన గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు ఆయనతో పాటు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్ బిన్ హుందాన్, ఇరిగేషన్, ట్రాన్స్కో, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు, పంచాయతీరాజ్ శాఖల ఉన్నత అధికారులు స్థానిక నాయకులు పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ గ్రామ సర్పంచ్ రియాజుద్దీన్ నాయకులు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజరెడ్డి మహమ్మద్ జావిద్, నితిన్ , గ్రామ ఉప సర్పంచ్ నాగేష్, ఫుర్ఖాన్ తదితరులు ఉన్నారు.

## పోలీస్ డ్రైవర్లకు కంటి వైద్య శిబిరం

**విశాలభారతి, గోదావరిఖని:**

రామగుండం పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ సహకారంతో 'అరైవ్-అలైవ్' రెండో విడత కార్యక్రమంలో భాగంగా పోలీస్ డ్రైవర్ల కోసం ప్రత్యేక కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న పోలీస్ శాఖ తమ సిబ్బంది ఆరోగ్యంపై కూడా సమాన శ్రద్ధ చూపుతోంది. రోజువారీ విధుల్లో వాహనాలు నడిపే పోలీస్ డ్రైవర్లకు స్పష్టమైన కంటి చూపు అత్యంత అవసరమైనందున ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా కంటి చూపును పరీక్షించుకోవాలని సూచించారు.గతంలో వాడుతున్న కళ్ల అద్దాలు ఉంటే వాటిని పరిశీలించి అవసరమైతే మార్చుకోవాలని తెలిపారు.కంటి చూపుతో పాటు ఇతర కంటి సమస్యలు కూడా ఉండే అవకాశం ఉన్నందున వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.రోడ్డు భద్రతలో డ్రైవర్ల కంటి చూపు కీలక పాత్ర పోషిస్తుంది. కంటి చూపు సరిగా ఉన్నవారే సమర్థవంతమైన సేవలు అందించగలరు అని పేర్కొన్నారు.వైద్య శిబిరానికి సహకరించిన లయన్స్ క్లబ్ డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పోలీస్ డ్రైవర్లకు నిపుణులైన వైద్యులచే సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించబడ్డాయి. చూపు సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కళ్ల అద్దాలు అందజేశారు. అధిక స్థాయి కంటి సమస్యలు గుర్తించిన సిబ్బందిని మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ స్వయంగా సిబ్బందికి కళ్ల అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ సిబ్బందిలో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు రహదారి భద్రతను మరింత బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, డాక్టర్ దుర్గ ప్రసాద్,ఆర్ఐలు శేఖర్,పెద్దన్న,మల్లేశం, వింగ్స్ ఇన్స్పెక్టర్లు బాబురావు,రమేష్ బాబు, శ్రీనివాస్, భీమేష్,సీసీ హరీష్, రాజేందర్,లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ మల్లికార్జున్, జోన్ చైర్మన్,సీనియర్ సభ్యులు రాజేందర్, రవీందర్ చారి,పోలీస్ సిబ్బంది మరియు సీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.




## అంతర్గాం మండలంలో పర్యటించిన మనాలి ఠాకూర్



**విశాలభారతి, అంతర్గం:** శుక్రవారం రోజున అంతర్గాం మండలంలోని పలు గ్రామంలో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలను రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ ఆత్మీయంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎండ తీవ్రత మధ్య కష్టపడుతూ పని చేస్తున్న కూలీలతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, వేతనాల చెల్లింపుల పరిస్థితి, పనుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళా కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే కీలక పథకమని, ప్రతి అర్హ కుటుంబానికి సమయానికి పని మరియు వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూలీలకు తాగునీరు, నీడ సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.కూలీల సంక్షేమం తమకు ముఖ్యమని, ఎప్పటికప్పుడు వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కట్టుబడి ఉన్నారని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు మరియు కూలీలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ల పంపిణీచేసిన మనాలి ఠాగూర్



**విశాలభారతి, గోదావరిఖని:** గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ మహిళా వర్కర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ మాట ప్రకారం శుక్రవారం రోజున వారికి కుట్టు మిషన్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి రాజ్ ఠాకూర్ పాల్గొని సింగరేణి మహిళా కార్మికుల చేతులకు స్వయంగా కుట్టు మిషన్లను అందజేశారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్



**విశాలభారతి, కోదాడ:** కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఇటీవల ఎన్నికైన ఎర్నేని కుసుమా వెంకటరత్నం బాబు శుక్రవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎర్నేని కుసుమా వెంకటరత్నం బాబు కోదాడ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్ ను కోరారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ నూతన చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## కార్పొరేట్ వైద్యం తక్కువ ఫీజుతో అందించాలి

**ఎమ్మెల్యే పద్మావతి**



**కోదాడ విశాలభారతి:** గ్రామీణ పట్టణ నిరుపేద ప్రజలకు హాస్పటల్ యాజమాన్యం తక్కువ ఫీజుతో కార్పొరేట్ వైద్యం అందించాలని కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి అన్నారు. అత్యాధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ నారాయణ హాస్పటలను శుక్రవారము వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్యం అందించాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని కోరారు. వైద్యో నారాయణో హరి అనే సూక్తిని స్మరిస్తూ, వైద్యాన్ని కేవలం వ్యాపారంగా చూడకుండా సామాజిక దృక్పథంతో రోగులకు సేవలు అందించాలన్నారు. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ కొల్లు కార్తీక్, కొల్లు శారద శ్రీనివాస్, కోదాడ మున్సిపల్ 30వ వార్డు కౌన్సిలర్ కారంగుల ఉమా అంజన్న గౌడ్, చిలుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ కొళ్ళు పుల్లమ్మ నాగయ్య, కోదాడ పట్టణ వైద్యులు కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భవిష్యత్ భద్రతే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**



దేశం 2047 నాటికి 'వికసిత భారత్'గా అవతరించాలంటే నేడు మనం చేసే ప్రతి పెట్టుబడి, తీసుకునే ప్రతి నిర్ణయం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. స్వయంసమృద్ధి కేవలం నినాదం కాదు, అది 140 కోట్ల భారతీయుల ఆకాంక్ష అని, ఈ దిశగా గత పదకొండేళ్లలో చేపట్టిన సంస్కరణలు దేశ రూపురేఖలను మార్చివేశాయని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. ఒకప్పుడు భారత్ ఆర్థికంగా బలహీనమైన ఐదు దేశాల జాబితాలో ఉండేదని, కానీ నేడు ప్రపంచమే భారత్ వైపు చూస్తోందని మోదీ గుర్తు చేశారు. దేశంలో పాలసీ పారాలిసిస్ తొలగిపోయి, నిర్ణయాత్మక నాయకత్వం రావడంతో అభివృద్ధి వేగం పుంజుకుందని తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులు, దిగ్గజ దేశాలు నేడు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం క్యూ కడుతున్నాయంటే దానికి కారణం మన దేశంపై ప్రపంచానికి ఏర్పడిన నమ్మకమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ నిర్మాణం అనేది స్వల్పకాలిక ఆలోచనలతో సాధ్యం కాదని, దానికి దీర్ఘకాలిక విజన్ అవసరమని ఆయన ఉద్ఘాటించారు.

దిగుమతులపై ఆధారపడటం వల్ల దేశ ఖజానాపై పడుతున్న భారాన్ని ప్రధాని గణాంకాలతో సహా వివరించారు. ఏటా విదేశీ నౌకల రవాణా కోసం రూ. 6 లక్షల కోట్లు, ఎరువుల దిగుమతికి రూ. 2.25 లక్షల కోట్లు, పెట్రోలియం ఉత్పత్తుల కోసం రూ. 11 లక్షల కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. ఈ భారీ మొత్తాన్ని దేశీయంగా ఉత్పత్తి చేయడం ద్వారా ఆదా చేయవచ్చని, ఆ నిధులను మౌలిక సదుపాయాలు, పరిశోధనలు, రైతుల సంక్షేమం కోసం వినియోగించవచ్చని ఆయన వివరించారు. స్వయంసమృద్ధి సాధించడం ద్వారా రాబోయే తరాలు దిగుమతుల గురించి కాకుండా, ఎగుమతుల గురించి గర్వంగా మాట్లాడుకుంటాయని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

ఈ సదస్సులో ప్రధానమంత్రి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న వారు దేశ నిర్మాణంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. కేవలం ఒకే కుటుంబానికి క్రెడిట్ ఇవ్వడంపైనే దృష్టి సారించి, దేశ ప్రయోజనాలను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రతిపక్షం అంటే కేవలం గుడ్డిగా వ్యతిరేకించడం కాదని, ప్రత్యామ్నాయ విజన్‌ను చూపడమని ఆయన హితవు పలికారు. ఇటీవల జరిగిన ఏఐ సమిట్ సమయంలో ప్రతిపక్ష నేతల తీరును ఆయన తప్పుబడుతూ, అది వారి మేధో దివాలాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత పారిశ్రామిక విప్లవాలలో భారత్ కేవలం అనుసరించే పాత్రకే పరిమితమైందని, కానీ కృత్రిమ మేధ విప్లవంలో భారత్ ప్రపంచానికి దిశా నిర్దేశం చేస్తోందని అన్నారు. మన దేశానికే సొంతమైన ఏఐ స్టార్టప్ ఎకోసిస్టమ్ ఉందని, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో మనం ప్రపంచానికే ఒక బెంచ్‌మార్క్‌గా నిలిచామని గర్వంగా చెప్పారు. భవిష్యత్తు సాంకేతికతను రూపొందించడంలో భారతీయ యువత మేధస్సు కీలకం కాబోతోందని ఆయన వివరించారు.

పర్యావరణ హిత ఇంధన రంగంలో భారత్ వేగంగా అడుగులు వేస్తోందని ప్రధాని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ మిషన్, ఇథనాల్ బ్లెండింగ్, సోలార్ ఎనర్జీ వంటి రంగాల్లో మనం సాధిస్తున్న పురోగతి వల్ల పెట్రోలియం దిగుమతులు గణనీయంగా తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశీయంగా సెమీకండక్టర్ల తయారీ, ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం ద్వారా భారత్ ప్రపంచ తయారీ కేంద్రంగా మారుతోందని చెప్పారు.

అభివృద్ధి చెందిన దేశాలు కూడా మన సాంకేతికతను, విధానాలను ప్రశంసిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ప్రధాని స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాదని, రక్షణ రంగంలో కూడా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆయుధాలను వినియోగిస్తూ దేశ సరిహద్దులను పటిష్టం చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరిపైనా ఆధారపడకుండా ఉండటమే నిజమైన స్వాతంత్ర్యం అని ఆయన అభిప్రాయపడ్డారు. దేశాన్ని చీల్చే శక్తులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, 2047 నాటికి సమర్థవంతమైన, సుసంపన్నమైన భారత్‌ను నిర్మించే ప్రయాణం ఆగిపోదని మోదీ పునరుద్ఘాటించారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించడానికి వారి అపసవ్య విధానాలే కారణమని మోదీ అన్నారు. 1984లో 400 పైగా సీట్లు గెలిచిన పార్టీ నేడు ఎందుకు పతనం వైపు సాగుతోందో వారు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. దేశ యువత ఇప్పటికే ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పారని, అభివృద్ధిని కాంక్షించే వారు ఎప్పుడూ దేశం వెంటే ఉంటారని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంస్కరణ సామాన్య మానవుడి జీవితంలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా సాగుతోందని చెప్పారు.

వికసిత భారత్ రోడ్ మ్యాప్ గురించి విమర్శలు చేసే వారికి ఆయన గట్టి సమాధానం ఇచ్చారు. దేశ నిర్మాణానికి సహనం, ధైర్యం మరియు దీర్ఘకాలిక వ్యూహాలు అవసరమని, అవి లేని వారే 2047 విజన్‌ను ప్రశ్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. క్లిష్ట సమయాల్లో కూడా భారత్ స్థిరంగా నిలబడి గ్లోబల్ గ్రోత్ ఇంజిన్‌గా మారిందని, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ వంటి సంస్థలు కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయని గుర్తు చేశారు. దేశం సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనను సమతూకం పాటిస్తూ ముందుకు వెళ్తోందని వివరించారు.

## బాధిత కుటుంబానికి సాయం



**విశాలభారతి, పాలకుర్తి:** పాలకుర్తి మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తాళ్ల పెల్లి ప్రేమ్ కుమార్ కుటుంబానికి దాతలు అండగా నిలిచారు. క్రైస్తవ జన సమితి అధ్యక్షుడు డా.మాసారం ప్రేమ్ కుమార్ విజ్ఞప్తితో డాక్టర్ మేడి ఆనంద్ పాల్, మధురవాణి దంపతులు, ఇరుగంటి విజయకుమార్ బాధిత కుటుంబానికి 25 కిలోల రైస్, 5 కిలోల మంచి నూనె ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు దేవమ్మ, పెద్ద యేసు, వినోద దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగారపు విజయ్ కుమార్, వంగాల సోమయ్య, తాళ్లపల్లి మధు, వంశీ తదితరులు ఉన్నారు.

## పాఠశాలను సందర్శించిన కేంద్ర పీఎం శ్రీ సభ్యులు



**నిజామాబాద్, విశాలభారతి:** పీఎం శ్రీ కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా ఈరోజు కేంద్ర పీఎం శ్రీ సభ్యులు జాయింట్ డైరెక్టర్ ఐడిఏఎస్ దేవేంద్ర కుమార్ రాయి, డైరెక్టర్ ఎస్ ఐ ఈ టి శ్రీమతి విజయలక్ష్మి భాయి, రాష్ట్ర ఏ ఎం ఓ శ్రీనాథ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఇంకా పలువురు అధికారులు కంజర లో ఉన్నటువంటి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను విచ్చేసి సందర్శించడం జరిగింది. విద్యార్థినిలతో సంభాషిస్తూ పాఠశాలలో జరుగుతున్నటువంటి పీఎం శ్రీ కార్యక్రమాల వివరాలు అన్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో జరుపబడిన కార్యక్రమాలను మరియు ఏర్పాటు చేసిన సౌకర్యాలను అన్నిటిని ప్రత్యక్షంగా చూసి పీఎం శ్రీ స్కీమును సక్రమంగా సద్వినియోగము చేస్తున్నందున ఎంతో సంతృప్తి చెంది విద్యార్థినులను, ఉపాధ్యాయులను మరియు ప్రిన్సిపాల్ జి. విజయలలిత ను ఈ సందర్భంగా వారు అభినందించడం జరిగింది.

## విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నుల వితరణ



**తిరుమలగిరి, విశాలభారతి :** శుక్రవారం రోజున లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు జలగం రామచంద్రన్ గౌడ్ ఉషారాణి పెళ్లిరోజు సందర్భంగా కస్తూర్బా పాఠశాలలో టెన్త్ క్లాస్ పిల్లలకు ఎగ్జామ్స్ కు ప్రిపేర్ అవుతున్న సందర్భంగా వారికి ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు పెన్నులు 40 మంది పిల్లలకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాత రామచంద్రన్ గౌడ్ సహకారంతో అందించడం జరిగినది. రామచంద్రన్ గౌడ్ మాట్లాడుతూ మీరందరూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్, డాక్టర్ రమేష్ కార్యదర్శి, ట్రెజరర్ సుందర్, మాజీ అధ్యక్షుడు మందడి పద్మా రెడ్డి, లైన్ అయిత శ్రీనివాస్, లైన్ గిరి గౌడ్, లయన్ గణేష్, లయన్ బుక్క శ్రీనివాస్, లైన్ నాగాచారి, మరియు పాఠశాల యాజమాన్యం మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చదువును ఆపొద్దు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉద్బోధ**




**నిజామాబాద్, విశాలభారతి:** ఎన్ని ఇబ్బందులు ఎదురైనా...చదువును అర్ధాంతరంగా ఆపొద్దని, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో చక్కగా స్థిరపడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థినులకు ఉద్బోధ చేశారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కలెక్టర్ చేతుల మీదుగా శుక్రవారం పునర్వినియోగ సానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు సంయుక్తంగా 60 వేల పునర్వినియోగ సానిటరీ ప్యాడ్లను బాలికలకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం కోటగల్లి బాలికల పాఠశాలలో 650 మంది బాలికలకు సానిటరీ ప్యాడ్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఈ ప్యాడ్లను ఏడాది కాలం పాటు పునర్వినియోగం చేసుకోవచ్చని, వీటిని వాడిన అనతరం శుభ్రపర్చుకుని చక్కగా ఆరబెట్టుకుంటే, తిరిగి వాటినే వినియోగించుకోవచ్చని సూచించారు. నెలసరి విషయంలో బాలికలు ఆందోళనకు లోను కావద్దని, మహిళలకు ఇది ప్రకృతి సహజంగా జరిగే పరిణామమని అన్నారు. హార్మోన్ల సమతుల్యత లోపిస్తే వైద్య పరీక్షలు జరిపించుకోవాలని సూచించారు. బాలికలు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ, ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని, బలవర్ధకమైన ఆహార పదార్థాలు తీసుకోవాలని అన్నారు. విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం, గౌరవం లభిస్తుందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్జనను కొనసాగించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్.బీ.ఐ రీజినల్ మేనేజర్ మహేశ్వరం, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సునీల్, పాఠశాల హెచ్.ఎం సాయరెడ్డి, ఎస్.బీ.ఐ, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాగూర్**

**విశాలభారతి, గోదావరిఖని:** నాణ్యత ప్రమాణాల పరిరక్షణ వంటి అంశాలపై అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి కోసం గోదావరిఖని లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్లే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ అంతర్గాం మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులతో మరియు సర్పంచ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అంతర్గాం మండల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా గ్రామీణ మౌలిక వసతులు, రోడ్లు, తాగునీరు, విద్యుత్, కాలువల నిర్మాణం తదితర అంశాలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంద్రమ్మ ఇండ్ల పథకం అమలుపై ప్రత్యేకంగా చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు, నిర్మాణ పనుల వేగవంతం, నాణ్యత ప్రమాణాల పరిరక్షణ వంటి అంశాలపై అధికారులను అప్రమత్తం చేశారు. ఎలాంటి ఆలస్యం లేకుండా లబ్ధిదారులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, అంతర్గాం మండల సర్పంచ్‌లు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఊరు పండగ సమావేశం

**నిజామాబాద్, విశాలభారతి:** ఎడపల్లిలో దేశ్ముఖ్ గడి వద్ద ఆదివారం నల్ల పోచమ్మ. అమ్మ వారికీ కడలు. మేకలను. బలి ఇచ్చుట గురించి గ్రామ పెద్దలు అన్ని కుల సంఘలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం ఉదయం 11:00 గంటలకు అమ్మ వారి కడలను తీయడానికి గ్రామ పెద్దలందరు నిర్ణయం చేయడం జరిగింది. కావున ఆదివారం రోజు అన్ని కుల సంఘల వారు ఆ టైం కడలను తీయగలరు. అనంతరం గత కొన్ని నెలల క్రితం రామారావు దేశ్ముఖ్ బాబా అనారోగ్యం కారణంగా చనిపోవడంతో. గ్రామ పెద్దలు. గ్రామస్తులు. వారికి సంతాపం వ్యక్తం చేశారు మౌనం రెండు 2 నిమిషాలు పాటిస్తూ వారి ఆత్మకు శాంతించాలని గ్రామస్తులు పెద్దలు యువకులు ప్రతి ఒక్కరు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో కర్ణం శంకర్ రావ్ బాబా. గ్రామ కమిటీ అధ్యక్షులు పోలమల్క రెడ్డి. గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్. సుధీర్ దేశ్ముఖ్. నీలకంఠరావుదేశ్ముఖ్. యోగేష్‌రావు దేశ్ముఖ్. న్యావనంది గోపాల్. జనగాం. మోహన్ రెడ్డి. న్యావనంది సుభాష్. బంజ కామప్ప. శంకర్ గౌడ్. కటకం పెద్ద సాయిలు. కల రాజేశ్వర్.ఉప సర్పంచ్ మచ్కురిగంగాధర్. ఆత్మీల శ్రీనివాస్.మల్లెపూల శ్రీనివాస్. నాయుడు పోతున్న. గుంజరి రాజు. గ్రామస్తులు పెద్దలు యువకులు పాల్గొన్నారు,



## పారిశుధ్యం–అభివృద్ధిపై కఠిన ఆదేశాలు

**రాజేంద్రనగర్ జోన్‌లో సమీక్షా సమావేశం**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ జోన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై జోనల్ కమిషనర్ మంద మకరందు ఈరోజు అన్ని సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జోన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్య నిర్వహణ, రోడ్లు-డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల, అలాగే ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల తక్షణ పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు మరియు ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## విద్యుత్ మీటర్ల కోసం ఎదురు చూపులు

**విద్యుత్ మీటర్ ఇవ్వని విద్యుత్ అధికారులు**



**కీసర,విశాల భారతి :** కీసరలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు కొత్త విద్యుత్ మీటర్ల కోసం కరెంట్ అధికారుల చుట్టూ ఎంత పడిగాపులు పడుతున్న పట్టించుకొని విద్యుత్ అధికారులు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నా లబ్ధిదారులు.ఓ పక్క ఇందిరమ్మ ఇళ్లు బిల్లు సకాలంలో రాకపోయినా లబ్ధిదారులు వారు కూడా బెట్టుకున్న సొంత డబ్బుతో ఇళ్లు పూర్తి చేసుకుంటున్నారు.కీసరకు చెందిన ఆముదాల భాగ్యలక్ష్మికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయింది.ఇళ్లు మంజూరు అయినప్పటి నుండి రకరకాల కారణాలలో చివరికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసుకుంది.వచ్చే నెల ఇంట్లోకి వెళ్దాం అని అంత రెడీ చేసుకుంది కరెంట్ మీటర్ కావాలి అని కీసర కరెంట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్న ఆమెకి కొత్త కనెక్షన్ ఇవ్వని విద్యుత్ అధికారులు. మాకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చింది అని సంతోషపడలిహ ఇలా విద్యుత్ అధికారులు మీటర్ ఇవ్వడంలేదు అని బాధ పడాలిహ అని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ళు పూర్తయినప్పటికీ,చాలా కుటుంబాలకు విద్యుత్ శాఖ నుండి శాశ్వత విద్యుత్ కనెక్షన్లు ఇంకా అందడంలేదు అని అంటున్న బాధితులు.అవసరమైన పత్రాలు మరియు దరఖాస్తులను విద్యుత్ అధికారులకు సమర్పించినప్పటికీ ఎలాంటి స్పందన లేదు.ఆలస్యం కారణంగా, సరైన విద్యుత్ సౌకర్యాలు లేకుండా ఇబ్బంది పడుతున్న ఇందిరమ్మ లబ్ధిదారులు.అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల యజమానులకు వీలైనంత త్వరగా కొత్త విద్యుత్ మీటర్లు అందేలా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని బాధిత లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కాటేదాన్ నుంచి భక్తుల పాదయాత్ర



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్‌లో నిర్వహించిన శ్రీ శ్యామ్ మిత్ర మండల్ నిషాన్ యాత్ర ఘనంగా జరిగింది. కాటేదాన్ నుండి రాందేవ్ బాబా దేవాలయం, శివరాంపల్లి వరకు పాదయాత్రగా భక్తులు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి గారు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కాటేదాన్ కార్యాలయం వద్ద స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. మంచి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మండల్ కమిటీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రాందేవ్ బాబా కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్, దత్తు బై, సీనియర్ నాయకులు రాహుల్ భాస్కర్, మాజీ డివిజన్ అధ్యక్షుడు అడిగే జనార్ధన్, నర్సిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామారావు, రమేష్ రెడ్డి, కిరణ్, శ్యామ్ పోపట్న్, శేఖర్, రాంబాబు, రమేష్, దీపక్ అగర్వాల్, సచిన్, శంకర్ రెడ్డి తదితర స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అశ్వాపురం పంచాయితీ ఇంచార్జ్ కార్యదర్శిగా శ్రీకాంత్



**అశ్వాపురం, విశాలభారతి :** అశ్వాపురం మేజర్ గ్రామపంచాయతీ ఇన్చార్జ్ కార్యదర్శిగా కందిమల్ల శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి 317 జీవోలో భాగంగా సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో గొందిగూడెం కొత్తూరు కార్యదర్శిగా పనిచేస్తున్న ఈయనకు అశ్వాపురం పంచాయతీ అదనపు బాధ్యతలను అధికారులు అప్పగించారు.

## రోడ్డు ప్రమాదాల తగ్గుదలలో డ్రైవర్ల పాత్ర కీలకం




**విశాలభారతి, గోదావరిఖని:**

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్-అలైవ్' రెండో విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో, వ్యాన్, టాక్సీ, లారీ డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించబడ్డాయి.సీపీ ఆదేశాల మేరకు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు కంటి వైద్య శిబిరాలను నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా కొంతమందికి కలర్ బ్లైండ్ సమస్య ఉండడం, వయస్సు పెరిగే కొద్దీ కంటి చూపు మందగించడం వంటి సమస్యలు ఎదురవుతాయని చెప్పారు. అలాంటి వారు కంటి పరీక్షలు చేయించుకొని తగిన చికిత్స పొందాలని సూచించారు. డ్రైవర్లకు కంటి చూపు సక్రమంగా ఉండటం అత్యవసరమని పేర్కొన్నారు.కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల వ్యాప్తంగా వ్యాన్,లారీ ,ఆటో, టాక్సీ డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడంతో పాటు తగిన చికిత్సను కూడా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించబడుతుందని వివరించారు. డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై పలు ముఖ్య సూచనలు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రహదారి సూచనలను గౌరవించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ మరియు ద్విచక్ర వాహనంపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించరాదని, అలసట లేదా నిద్రలేమి ఉన్నప్పుడు వాహనం నడపవద్దని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని సూచించారు.అలాగే బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న జాగ్రత్త ప్రాణాలను కాపాడగలదని డీసీపీలు ,ఏసీపీలు పేర్కొన్నారు. ఈ శిబిరం ద్వారా సుమారు 300 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రమాదరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు కోరారు.

## రంజాన్ సందర్భంగా సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే



**విశాలభారతి, గోదావరిఖని:**

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం తరపున అనేక రకాల కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదని రామగుండం శాసన సభ్యులు ఎం . ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. మేయర్ మహంకాళి స్వామి అధ్యక్షతన రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో రంజాన్ పర్వదినం రోజు చేయవలసిన ఏర్పాట్లపై వివిధ విభాగాల అధికారులు , మజీద్ కమిటీ ల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మజీద్ , ఈద్గా ల వద్ద రంజాన్ సందర్భంగా సింగరేణి , ఎన్ టి పి సి , ఆర్ ఎఫ్ సి ఎల్ తదితర సంస్థల సహకారంతో రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి రామగుండం , ఎన్ టి పి సి , గోదావరి ఖని , ఎయిట్ ఇంక్లైన్ కాలనీ ఏరియాలలో ఉన్న అన్ని ఈద్గా లు ,మజీద్ ల వద్ద అభివృద్ధి పనులతో పాటు ఫంక్షన్ హాల్స్ నిర్మాణం , కబ్రస్తాన్ లలో వసతులు ఏర్పాట్లు చేయడం జరుగుతున్నదని అన్నారు. ప్రతి మజీద్ , ఈద్గా వద్ద రంజాన్ పురస్కరించుకొని టెంట్లు , కార్పెట్లు , మంచి నీళ్ళు , జెనరేటర్ తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇంకా అవసరమైన వసతుల గురించి దృష్టికి తీసుకువస్తే వెంటనే చేపట్టడం జరుగుతుందని అన్నారు.రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ గత ఏడాది రూ 12.50 లక్షల వ్యయంతో రంజాన్ ఏర్పాట్లు చేయగా ఈ దఫా రూ 14.20 లక్షలతో రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో ఏర్పాట్లు చేయడం జరుగుతున్నదని అన్నారు. అలాగే సింగరేణి , ఎన్ టి పి సి , ఆర్ ఎఫ్ సి ఎల్ సంస్థల సహకారం కూడా తీసుకొని వారి ప్రభావిత ప్రాంతాలలోని మజీద్ లు , ఈద్గా ల వద్ద ఇంకా అవసరమైన అన్నిఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో మత పెద్దలు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నీటినీ పరిష్కరించే ప్రయత్నం చేస్తామని అన్నారు. అలాగే మైనారిటీ యువత కు ఉపాధి అవకాశాలు పెంపొందించాలని రామగుండం శాసన సభ్యులు ఎం .ఎస్. రాజ్ ఠాకూర్ అసెంబ్లీ లో చేసిన సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ కింద ఇ స్కూటర్ అనే పథకం ప్రవేశపెట్టిందని అన్నారు. ఇ స్కూటర్ విలువ రూ 1,50,000/కాగా డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న నిరుద్యోగ మైనారిటీ యువకులు లబ్ధిదారు వాటా రూ . 30, 000/ చెల్లిస్తే మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ 1,20,000 / భరిస్తుందని అన్నారు. ఆన్ లైన్ "టి జి ఓ బి ఎం ఎం ఎస్ " వెబ్ సైట్ లో మార్చి ఒకటవ తేదీ లోపు ధరఖాస్తు చేసుకొని పత్రాలు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని మెప్మా విభాగంలో సమర్పించాలని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని "ఇస్కూటర్" ను ఓలా , రాపిడో , ఊబర్ వంటి సంస్థలతో అనుసంధానం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి వి రామన్ , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, సింగరేణి ఆర్ జి 1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ , మీర్ జాకీర్ ఆలీ , రియాజుద్దీన్ , నజీర్ , ఫజలుద్దీన్ , గౌస్ , గఫూర్ , ఫజల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## కవాడిపల్లి అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఇందిరమ్మ కాలనీలో డ్వాక్రా మహిళ భవనం.. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కవాడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం రోజు ఉదయం అభివృద్ధి పనులకు ఘనంగా శ్రీకారం చుట్టారు. డ్వాక్రా మహిళల కోసం నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన చేయడంతో పాటు, ఇందిరమ్మ కాలనీ నుండి ప్రభుత్వ పాఠశాల వరకు నిర్మించనున్న రహదారికి కూడా శంకుస్థాపన గ్రామ సర్పంచ్ కొలను ప్రసన్న లక్ష్మి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ.. మహిళా సంఘాల అభివృద్ధి కోసం డ్వాక్రా భవనం ఎంతో ఉపయోగపడుతుందని, అలాగే కాలనీ ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండేలా రోడ్డు నిర్మాణం చేపట్టడం గ్రామ అభివృద్ధిలో కీలకమని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాసాల రాము యాదవ్, ఏఈ సూర్య తేజ, పంచాయతీ సెక్రెటరీ రజినీకాంత్ రెడ్డితో పాటు వార్డు సభ్యులు ఎర్రకోలు నిరోష రవి, కొలను శివా రెడ్డి, రంగ అంబికా శ్రవణ్, కందడి అనూష మధుసూదన్ రెడ్డి, బొడిగె సురేష్, ఇరుగు సాయి, సుర్వి ఝాన్సీ విశ్వేశ్వర్, గడ్డం కృష్ణవేణి గిరిబాబు, మాజీ సర్పంచ్ కందడి కృష్ణ రెడ్డి, దూసరి సుజాత యాదయ్య గౌడ్, కాలనీ వాసులు, గ్రామ పెద్దలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుంది



**కేశంపేట,విశాలభారతి:** సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఎడ్యుకోజ్ అకాడమీ డైరెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలోని ఎడ్యుకోజ్ అకాడమీలో సైన్స్ ఎగ్జిబిషన్ - 2026ను ఘనంగా నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిషన్ లో విద్యార్థుల శాస్త్రీయ నమూనాలు, సృజనాత్మక ప్రాజెక్టులు ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.విద్యార్థుల ప్రతిభ, ఆత్మవిశ్వాసం, పరిశోధనా దృక్పథం అందరినీ అభినందింపజేసింది. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఎగ్జిబిషన్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి నరేంద్ర సహకారం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** సంత్ సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణం కొరకు బండ్లగూడ జాగింగ్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ నరేంద్ర తమ వంతు సహాయంగా రూ.1,23,600 విరాళంగా అందజేశారు. నరేంద్ర కుటుంబానికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, శ్రీ సంపదలు కలగాలని, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాం. అలాగే అమ్మవారి కృపాకటాక్షాలు, ఆ భగవంతుని దయ ఎల్లప్పుడూ వారి కుటుంబంపై ఉండాలని కోరుకుంటున్నాం. మీరు చేసిన ఈ సహాయం మరువలేనిది. సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణ కమిటీ సభ్యుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో రాజకీయంగా, వ్యాపార పరంగా మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తున్నాం.

## ఫీజుల కారణంగా హాల్ టికెట్లు ఆపడం అన్యాయం

**ఆర్‌టీఐ సాధన కమిటీ డిమాండ్ .. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేత**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** జిల్లాలో 10వ తరగతి విద్యార్థులకు ఫీజు బకాయిల పేరుతో హాల్ టికెట్లు నిలిపివేయడం తక్షణమే నిలిపివేయాలని ఆర్‌టీఐ సాధన కమిటీ డిమాండ్ చేసింది. పరీక్షలు సమీపిస్తున్న వేళ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పూర్తి ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని ఒత్తిడి చేయడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ.. ఫీజుల కోసం హాల్ టికెట్లను అడ్డుకోవడం చట్టవిరుద్ధమని, వెంటనే జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని అన్ని పాఠశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే సమాచార హక్కు చట్టం 2005ను జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేసి ప్రతి పౌరుడికి నిర్ణీత గడువులో సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి, రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగంటి రాజ్‌కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి అజయ్ కుమార్, సహాయ కార్యదర్శి శివకుమార్, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ ప్రవీణ్, కోకన్వీనర్లు గోదాసు రాములు, కందుకూరి రాములు, చైతన్య, అరుణ్ సింగ్, శ్రీశైలం, గణేష్, బాబు గణేష్, యాదగిరి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## గౌరెల్లి గ్రామంలో యువకుడి అదృశ్యం

**నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ వివరాలు వెల్లడి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** కుంట్లూర్ డివిజనగౌరెల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడు చిట్టెంపల్లి ప్రసాద్ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 21 022026 తేదీన రాత్రి సుమారు 8 గంటల సమయంలో కార్ డ్రైవింగ్ పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్లిన ప్రసాద్ తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి.బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఎటువంటి సమాచారం లభించలేదు.గల్లంతైన యువకుడు సుమారు 5 అడుగుల ఎత్తు, గోధుమ వర్ణం, గుండ్రని ముఖం కలిగి ఉంటాడు. చివరిసారిగా తెలుపు ప్యాంటు, తెలుపు స్వెటర్, గోధుమ రంగు చొక్కా ధరించి వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై 26022026 తేదీన సాయంత్రం కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ వెల్లడించారు. యువకుడి గురించి ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా 8712662751, 8712662723 నంబర్లను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## సమస్య మీది పరిష్కారం మాది నెమలి అనిల్ కుమార్



**కాప్రా , విశాలభారతి:** బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా చర్లపల్లి డివిజన్ నుండి ఉమ్మడి మల్లాపూర్ శక్తిసాయి నగర్ డివిజన్ లో విలీనం అయిన భరత్ నగర్ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పర్యటించి స్థానికుల మధ్యకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.కాలనీలోని తాగునీరు,డ్రైనేజీ, రోడ్లు,దోమల సమస్య,స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రజలు వివరించిన సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో భరత్ నగర్ కాలనీలో ఉన్న అన్ని ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, కాలనీ ప్రజలకు నెమలి అనిల్ కుమార్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానికులు అలీం,అన్వర్, కలీం, సోహైల్, జునైద్, అఫ్నాన్, అనస్, నజీర్, షేవార్, మొయిజ్ , నజీం, రఘు, కృష్ణ , రాకేష్ , అఖిలేష్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే అభివృద్ధి



**సికింద్రాబాద్, విశాలభారతి:**

ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు తనను వ్యక్తిగతంగా విమర్శించే నైతికత లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ విషయంలో తాను రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డు పడుతున్నానని ముఖ్యమంత్రి తనపై బురద జల్లడం మానుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వేలకోట్ల రూపాయల అభివృద్ధి పనులను తెలంగాణలో చేస్తున్నామని త్వరలోనే అభివృద్ధి పనుల జాబితాకు సంబంధించి పి పి టి ఇస్తానని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం పేరిట వారాసిగూడ, మెట్టుగూడ, బౌద్ధ నగర్ ప్రాంతాలలో భాజపా శ్రేణులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి ప్రధానంగా రహదారులు డ్రైనేజీతోపాటు రెండు పడక గదుల కేటాయింపులు జరగకపోవడం, పెన్షన్ల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంశాలు తన దృష్టికి వచ్చినట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో మౌలిక వసతులు కూడా సరిగా లేని దుస్థితికి గత బిఆర్ఎస్ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. నాలాలలో పూడికతీతల కోసం అధునాతన టెక్నాలజీని వినియోగించాలని చెప్పినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని చిన్నపాటి వర్షానికే నగరం మునిగిపోతున్న దుస్థితి ఏర్పడిందని అన్నారు. వీధి దీపాల కోసం కార్పొరేటర్లు ధర్నాలు చేయడం కాంట్రాక్టర్ల బిల్లును కోసం తంటాలు పడుతుండడం చూస్తుంటే హైదరాబాదు నగర పరిస్థితి ఏంటో అర్థం అవుతుందని అన్నారు. రాష్ట్రానికి 70% ఆర్థికంగా ఆదాయం హైదరాబాద్ నగరం నుండి వస్తున్నప్పటికీ 7% కూడా బడ్జెట్లో కేటాయింపులు ఉండడం లేదని ఆక్షేపించారు. మెట్రో విషయంలో తాను అడ్డుపడుతున్నానని ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని కొట్టి పారేశారు. మెట్రో విస్తరణ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్రానికి ఇప్పటికీ డీపీఆర్ పంపించలేదని చెప్పారు. మోసే ప్రక్షాళనకు భాజపా వ్యతిరేకం కాదని గత 50 సంవత్సరాల నుండి గృహాలు నిర్మించుకొని ఉంటున్న పేద ప్రజల ఇల్లు తొలగించడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని పేద ప్రజల ఇల్లా జోలికి వెళ్ళవద్దని అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను ఏర్పాటు లాగా తీర్చిదిద్దుతున్నట్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. రైల్ ఎలివేటెడ్ కారిడార్ లో భాగంగా ఏడు బుల్లెట్ రైళ్లను కేంద్రం ప్రకటించగా అందులో మూడు రైళ్లు సికింద్రాబాద్కు తీసుకువచ్చిన ఘనత తనదేనని స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మేయర్ ను మజిలేసుకు అమ్ముకోవాలని కాంగ్రెస్ చూస్తుందని దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకొని భాజాపసత్తా ఏంటో నిరూపిస్తామని చెప్పారు. గ్రేటర్ హైదరాబాదులో 150 డివిజన్లను 300 డివిజన్లుగా పెంచినప్పటికీ అభివృద్ధి చేస్తారని విశ్వాసం తనకు లేదని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్ గౌడ్, మేకల సారంగపాణి, బండ కార్తిక రెడ్డి, కనకట్ల హరి, నాగేశ్వర్ రెడ్డి, ప్రభు గుప్త, అజయ్ నాయుడు, రాజేష్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పురోగతిపై విస్తృత సమీక్ష




**నిజామాబాద్, విశాలభారతి:**

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం సమయపాలనతో, నాణ్యతతో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల స్థితి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మరమ్మతులు, ఇందిరమ్మ ఇళ్లకు నిధుల విడుదల, వీధి దీపాల నిర్వహణ, దెబ్బతిన్న రోడ్ల ప్యాచ్ వర్కులు, రూ.5 కోట్ల ప్రత్యేక నిధుల వినియోగం, రూ.32 కోట్ల యు ఐ డి ఎఫ్ జంక్షన్ అభివృద్ధి పనులపై వివరాలు తీసుకున్నారు. ఆస్తి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని సూచించారు. టి యు ఎఫ్ ఐ డి సి ఫేజ్ 1 పనుల పూర్తి స్థితి, సోనీ ఫంక్షన్ హాల్ సమీప వంతెన, కళాభవన్ నిర్మాణం, అర్సపల్లి ఆర్ఓబి పురోగతిపై నివేదికలు సమర్పించగా, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అమృత్ 2.0 కింద యు జి డి పనులు, నీటి సరఫరా, టి యు ఎఫ్ ఐ డి సి ఫేజ్ 2 (రూ.60 కోట్లు), ప్రగతి నగర్ శ్మశాన వాటిక, రామార్తి చెరువు సుందరీకరణ పనులపై సమీక్షించారు. దీంతో కలెక్టర్ స్పందించి అభివృద్ధి విషయంలో అర్బన్ నియోజకవర్గంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులతో తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనులు ఎలా జరుగుతున్నాయో అవసరమైతే క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తానని ఎమ్మెల్యేకి కలెక్టర్ చెప్పారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పూలంగ్ వాగు ఆక్రమణలు తొలగింపు, నగరం కాలువ మరమ్మతులు, బొడ్డెమ్మ చెరువు సమస్యల పరిష్కారం, ఐదు ఇంటర్నల్ పార్కుల నిర్మాణ పురోగతిపై చర్చించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, సంక్షేమ శాఖ ఆసుపత్రిలో మరమ్మతులు, సిబ్బంది అందుబాటు, వేసవి ప్రత్యేక చర్యలు, వికలాంగులకు సహాయక పరికరాల పంపిణీ, వృద్ధులు, పిల్లల సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఇందూరు అర్బన్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్నపనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలన్నారు.

## అంగరంగ వైభవంగా వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవం



**ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ గ్రామ పరిధిలోని శ్రీశ్రీశ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో గురువారం రాత్రి శ్రీశ్రీశ్రీ వీరభద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తుల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ మహోత్సవాన్ని గ్రామ సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్ కుమార్ తోపాటు దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. సాయంత్రం నుంచే ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలతో, పూలతోరణాలతో అందంగా అలంకరించబడగా, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని వీక్షించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. ప్రత్యేక పూజలు, హోమాలు, మంగళహారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా భక్తులు భక్తి పరవశంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్ కుమార్ మాట్లాడుతూ.. బలిజగూడ గ్రామ ప్రజల ఐక్యతతో ప్రతి సంవత్సరం స్వామివారి ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు జక్క రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందికంటి విజయకుమార్, కోట ప్రభాకర్ రెడ్డి, రాజపాక నవనీత మహేష్, కోశాధికారి ఎర్రవల్లి గౌరీ శంకరాచారి తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు మందుగుల విజయ శ్రీశైలం గౌడ్,పబ్బతి బాలకిషన్ గౌడ్, కొలను లక్ష్మీ ప్రసన్న రవీందర్ రెడ్డి,దేసారం రాఘవేందర్ గౌడ్, అంతటి హేమలత జంగయ్య గౌడ్,ఎర్ర వెంకటేష్ యాదవ్,మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్ గౌడ్,అల్లే ఐలయ్య యాదవ్, బలిజగూడ గ్రామ ఉప సర్పంచ్ ఉప్పు నరేష్, మాజీ ప్రజాప్రతినిధులు బుర్ర వీరస్వామి, మండల కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఉప్పు వెంకటేష్, బుర్ర జ్ఞానేశ్వర్ గౌడ్, ఉప్పు జ్ఞానేశ్వర్, ఉప్పు సురేష్, బుర్ర మహేష్ గౌడ్, బలిజగూడ గ్రామ బిజెపి ప్రెసిడెంట్ ఉప్పు రజినీకాంత్, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల సన్మాన సభ



**మొయినాబాద్ , విశాలభారతి:**

మొయినాబాద్‌లోని అంజనా దేవి గార్డెన్ లో ఈ రోజు మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సోనియా, వైస్ చైర్మన్ రాజు మరియు అన్ని పార్టీల కౌన్సిలర్లకు సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మొయినాబాద్ మండల అధ్యక్షుడు మానయ్య, షాబాద్ దర్శన్, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పెంట రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మొయినాబాద్ మండల సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మొయినాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సభలో నాయకులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

## పాఠశాలలో భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**నాచారం, విశాలభారతి:** మల్లాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యాభివృద్ధే సమాజ పురోగతికి మూలాధారం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి టెక్నిప్ఎంసీ సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరించగా, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ భాగస్వామిగా ఉంది. కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాస్ రెడ్డి , మల్లాపూర్ మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్ వివిధ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక చేయూత



**కేశంపేట,విశాలభారతి:** 1962 పశు సంచార వాహన సేవల ఉద్యోగిగా షాద్ నగర్ లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో అకాల మృతి చెందిన హరీష్ కుటుంబానికి జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ తరుపున ఎస్.హెచ్.వో సుధాకర్, హెచ్.ఆర్ హెడ్ కిరణ్ కిషోర్ లు రూ.5 లక్షల చెక్కును సోమవారం ఆర్థికసహాయంగా అందజేశారు. షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన హరీష్ 8 ఏండ్లుగా 1962లో హెల్పేర్ గా విధులు నిర్వహిస్తున్నాడు.గత నెల జనవరి 23న అనారోగ్యంతో మరణించాడు.ఆయన చేసిన సేవలకు గుర్తుగా హరీష్ తండ్రి మల్లయ్య,తల్లి మల్లమ్మలకు 5లక్షల రూపాయల చెక్కును అందించారు.

## నానాజీపూర్ గ్రామానికి బస్సు సర్వీస్ ప్రారంభం




**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని నానాజీపూర్ గ్రామానికి ఎట్టకేలకు బస్సు సర్వీస్ ప్రారంభమైంది. గ్రామస్తులు, ముఖ్యంగా విద్యార్థులు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేయడంతో, మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల సందర్భంగా బీజేపీ పార్టీ అభ్యర్థి తరపున ప్రచారం చేస్తూ గెలిచినా ఓడినా గ్రామానికి బస్సు సర్వీస్ తీసుకొస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టి జి ఎస్ ఆర్ టి సి) ఉన్నత అధికారులతో పలుమార్లు చర్చలు జరిపి బస్సు సర్వీస్ ప్రారంభానికి కృషి చేశారు. ఫలితంగా ఈరోజు ఘనంగా బస్సు సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి మరియు స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. ఎన్నో రోజులుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు, విద్యార్థులు, యువకులు ఆనందం వ్యక్తం చేస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారి సహకారం కూడా ఎంతో ఉందని, వారి సేవలకు మన అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామాల అభివృద్ధి బీజేపీ పార్టీతోనే సాధ్యమని మరొకసారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్‌రాజు గారు, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, వంగ మహేందర్ రెడ్డి, మునుగుల రాజిరెడ్డి గారు, వార్డు సభ్యులు మున్నూరు సిద్దులు గారు, మైలారం రాధికాశ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి గారు, సిద్దేశ్వర్ గౌడ్, సంతోష్ కుమార్, వెంకటేష్ గౌడ్, మైలారం దర్శన్, మైలారం కృష్ణ, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు మృతి



**మొయినాబాద్ , విశాలభారతి:** హైదరాబాద్ సమీపంలోని ప్రసిద్ధ దేవాలయం చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు శ్రీ సి.ఎస్. సౌందరరాజన్ ఈ రోజు పరమపదించారు. ఈ వార్త తెలిసి భక్తులు, ఆధ్యాత్మిక వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. దశాబ్దాలుగా ఆలయ సేవలో నిమగ్నమై, లక్షలాది భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందించిన ఆయన సేవలు చిరస్మరణీయమని భక్తులు పేర్కొంటున్నారు. ఆలయ సంప్రదాయాలు, పూజా విధానాలను కచ్చితంగా పాటిస్తూ, చిలుకూరు బాలాజీ ఆలయ ప్రతిష్ఠను దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే భక్తులు ఆలయానికి చేరుకుని నివాళులు అర్పిస్తున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. శ్రీ సి.ఎస్. సౌందరరాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని భక్తులు ప్రార్థిస్తున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సిపిఐ రాష్ట్ర నాయకులు

**అందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** సూర్యాపేట జిల్లా, మద్దిరాల మండలంలోని మధు గార్డెన్‌లో బొంత రాంమూర్తి-నాగమణి దంపతుల కుమారుడు వెంకటేష్ వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు హాజరైన అతిథులు వధూవరుల దాంపత్య జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సందడితో మధు గార్డెన్ కళకళలాడింది.అలాగే సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, సైదులు ముదిరాజ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

విశాల భారతి CINEMA

# రైతులకు భరోసాను వెంటనే ఇవ్వాలి

**బిఆర్ఎస్ మండల అధ్యక్షులు**
**కోడి అమరేందర్ యాదవ్**

**అశ్వాపురం, విశాలభారతి :**



రబీలో రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి వరి నాట్లు పూర్తయి రోజులు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను విడుదల చేయడంలో జాప్యం చేయడం తగదన్నారు. మున్సిపల్ ఎన్నికలు అనంతరం రైతు భరోసా ఇస్తామని హడావిడిగా ప్రకటించిన రేవంత్ రెడ్డి సర్కార్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మొదట డిసెంబర్ మాసంలో ఇస్తానని ఆ తర్వాత మాట మార్చి సంక్రాంతి సంక్రాంతికిస్తామని మరో దఫా కల్లబొల్లి మాటలు చెప్పి రైతులను మధ్య పెట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా విషయంలో మీరన్న రెండు హామీలు తుంగలో తొక్కారని, ఇక రైతు భరోసాను మార్చిలో ఇస్తామంటూ వాయిదాలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతులకు రవి సాగులో భరోసా అందకపోవడం వల్ల పెట్టుబడులకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రైతుల ఓట్ల కోసం ఒకసారి మాత్రమే రైతుబంధు ఇచ్చి మరలా ఆ మాటే మరిచిపోవడం సర్కారుకు శ్రేయస్కరం కాదన్నారు. అంతేకాకుండా రైతుకు ఎంతో కీలకమైన సహకార ఎన్నికలను నిర్వహించకుండా రద్దు చేస్తామని సంకేతాలు ఇవ్వడం రైతులను అయోమయ స్థితిలో పడేసిందన్నారు. ఇప్పటికైనా రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాలలో నగదును వేసి ఆదుకోవాలన్నారు. అదే విధంగా రైతులకు మాఫీ చేస్తానని చెప్పిన రూ. 2 లక్షల రుణమాఫీ ని ఎటువంటి నిబంధనలు లేకుండా బ్యాంకులలో రైతులకు ఎంత అప్పు ఉన్నా ప్రభుత్వం చేస్తానని చెప్పినా రెండు లక్షల మాఫీ చేసి రైతు ప్రభుత్వంగా పేర్చుకోవాలన్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

# కులాలు వేరైనంత మాత్రాన ప్రేమిస్తే చంపేస్తారా

**న్యాయవాది అవులూరి సత్యనారాయణ**

**భద్రాచలం, విశాలభారతి:**

స్థానిక తెలంగాణ టూరిజం నందు షెడ్యూల్ కులాల జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం ఉద్దేశించి జేఏసీ నాయకులు న్యాయవాది అవులూరి సత్యనారాయణ మాట్లాడుతూ....ప్రేమించి పెళ్లి చేసుకోవడమే నేరంగా ఆధిపత్య కులాలు షెడ్యూల్డ్ కులాల వారిని కనికరం లేకుండా దాడులు ,హత్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లాలో మంగపేట నియోజకవర్గానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారని కుల అహంకారంతో అతి దారుణంగా రాళ్లతో కొట్టి హత్య చేశారని అన్నారు. భారత దేశంలో ఎక్కడ చూసినా కుల అహంకార హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఈ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కుల అహంకార హత్యలు పెట్రేగిపోతున్నాయని, షెడ్యూల్ కులాలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన అన్నారు. షెడ్యూల్ కులాలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని, ఎవరైతే దాడులు, హత్యలు అత్యాచారాలు చేస్తున్నారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల జేఏసీ నాయకులు అల్లాడి పౌల్ రాజ్, అలవాల రాజా పెరియార్, పూస శీను,తూరపాటి కోటయ్య తిప్పనపల్లి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.




# నాలుగేళ్ల కార్యదర్శుల పనితీరు బేస్




**కితాబిచ్చిన ఎంపీడీవో జి.ముత్యాలరావు**

**అశ్వాపురం, విశాలభారతి :**

మండలంలోని అశ్వాపురం, మొండికుంట పంచాయతీ కార్యదర్శులుగా గత నాలుగేళ్ల కాలంలో పనిచేసిన డి. మల్లేశం, ఏ. ప్రవీణ్ ప్రజలకు అందించిన సేవలు బేసుగ్గా ఉన్నాయని ఎంపీడీవో జి. ముత్యాలరావు అన్నారు. 317 జీవో లో భాగంగా వారి సొంత జిల్లాలకు బదిలీపై వెళుతున్న కార్యదర్శులను మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సుదూర జిల్లాల నుండి మండలానికి విధి నిర్వహణలో భాగంగా వచ్చి ఇక్కడ నెలకొని ఉన్న పరిస్థితులకు అనుగుణంగా విధులు నిర్వర్తించి ఎవరితో ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా సామాన్య ప్రజలకు తనదైన శైలిలో సేవలందించినవారు బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉన్నప్పటికీ ఉద్యోగరీత్యా ఇవన్నీ సర్వసాధారణం అన్నారు. వారు ఎక్కడున్నా విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి మరింత ఉన్నతమైన బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సన్మానించిన వారిలో యు డి సి పద్మావతి, కార్యదర్శులు అజార్, నరేందర్, శ్రీకాంత్, ఎన్ వెంకటేశ్వర్లు, శ్రావల్య , నరసయ్య, లవకుమార్ తదితరులు ఉన్నారు.



# కాల్షీట్ దొరికితే చాలు!

ఎంత పెద్ద హీరో సినిమా అయినా.. ఎంత గొప్ప ప్రొడక్షన్ అయినా.. పాత్ర నచ్చకపోతే నిర్మొహమాటంగా 'నో' చెప్పేస్తుంది సాయిపల్లవి. ఇలాంటి ఆటిట్యూడ్ కథానాయికలకు కరెక్ట్ కాదనే వాళ్లు లేకపోలేదు. తత్ఫలితంగా విజయాలను వదులుకోవాల్సివస్తుందంటూ కొందరు అభిప్రాయపడ్డారు కూడా. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ అఖండ విజయాలను అందుకుంటూ, స్థాయికి తగ్గ పాత్రలను చేజిక్కించుకుంటూ గొప్ప నటిగా ఎదురులేని కెరీర్‌ని కొనసాగిస్తున్నది కలైమామణి సాయిపల్లవి. ప్రస్తుతం తమిళంలో 'అమరన్' దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలో ధనుష్‌కు జోడీ నటిస్తున్నది సాయిపల్లవి. అలాగే, లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతితో కలిసి ఓ సినిమా చేస్తున్నది. ఇక బాలీవుడ్‌లో 'ఏక్ దిన్' సినిమాతోపాటు, పాన్‌ఇండియా పౌరాణిక చిత్రం 'రామాయణ'లో మహాసాధ్వి సీతగా నటిస్తూ ఏ హీరోయిన్‌కీ లేని లైనప్‌తో దూసుకుపోతున్నది సాయిపల్లవి. మొత్తంగా సాయిపల్లవి కాల్‌షీట్స్ దొరికితే సినిమా సగం విజయం సాధించినట్టే అన్నట్టుగా ప్రస్తుతం నిర్మాతలు భావిస్తున్నారట.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.